మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 11-11-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 132 Issue: 132

Published from Jagitial
www.evarthalu.com

11 నవంబర్ 2025 - మంగళవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:22 సూర్యాస్తమయం - సా. 5:37 తిథిః సప్తమి రా. 11:14 వరకు తరువాత అష్టమి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం పుష్యమి సా. 6:20 వరకు తరువాత ఆశ్లేష యోగం శుభ ఉ. 9:39 వరకు కరణం విష్టి ఉ. 11:37 వరకు బవ రా. 11:14 వరకు వర్జ్యం రా. 10:43 నుండి రా. 11:34 వరకు దుర్ముహూర్తం ఉ. 8:37 నుండి ఉ. 9:22 వరకు రాహుకాలం మ. 2:48 నుండి సా. 4:13 వరకు యమగండం ఉ. 9:11 నుండి ఉ. 10:35 వరకు గుళికాకాలం మ. 12:00 నుండి మ. 1:24 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:46 నుండి తె. 5:34 వరకు అమృత ఘడియలు మ. 12:01 నుండి మ. 1:35 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:37 నుండి మ. 12:22 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



# ఎరుపెక్కిన ఎర్రకోట

**11 మంది దుర్మరణం**

- దేశ రాజధానిలో బాంబ్ బ్లాస్ట్
- పేలుడు ధాటికి మృతదేహాలు ఛిద్రం
- షాపులకు వ్యాపించిన మంటలు
- ఘటన వెనుక ఉగ్ర కుట్ర?
- రంగంలోకి క్లూస్‌టీమ్, ఎన్ఐఏ
- ఉలిక్కిపడ్డ భారతం.. దేశమంతా అలర్ట్


సోమవారం సెలవు కావడంతో ఢిల్లీ ప్రశాంతంగా ఉంది.. పర్యాటక ప్రదేశాలు, మార్కెట్లు బోసిపోయి కనిపిస్తున్నాయి. సరిగ్గా సాయంత్రం 6.52 అవుతోంది.. ఎర్రకోట సమీపంలో 'ఢాం' అని ఒక్కసారిగా భారీ పేలుడు.. ఓ కారు పేలి పక్కనున్న పదుల సంఖ్యలో వాహనాలు పేలిపోయాయి. అక్కడే ఉన్న కొంతమంది ముక్కలుముక్కలయ్యారు. మాంసం ముద్దలు చెల్లాచెదురయ్యాయి. పేలుడు ధాటికి పక్కనున్న భవనాల కిటికీలు కంపించిపోయాయి. ఏం జరుగుతోంది అని అర్థం చేసుకొనేలోపే ఎర్రకోట ప్రాంతం అంతా ఎరుపెక్కింది. ప్రజల హాహాకారాలు మిన్నంటాయి. వాహనాలు మంటల్లో కాలుతూ బూడిదగా మారాయి.

## ఐ20 కారులో పేలుడు



ఎర్రకోటకు సమీపంలోని సుభాష్ మార్గ్ కూడలి వద్ద పేలుడు సంభవించింది. హ్యుండాయ్ ఐ20 కారులో పేలుడు జరిగింది. ఎన్ఎస్‌జీ, ఎన్ఐఏ, ఫోరెన్సిక్ బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి. సిగ్నల్ సమీపంలోని సీసీ టీవీల ఫుటేజీని పరిశీలించాలని ఆదేశించాను. పేలుడు తర్వాత అక్కడికి చేరుకున్న ఢిల్లీ సీపీ, స్పెషల్ బ్రాంచ్ ఇంచార్జితో మాట్లాడాను. ఈ దాడికి సంబంధించిన పూర్తి సమాచారం దర్యాప్తులో వెలుగులోకి వస్తుంది. అందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతాం. ఇన్విస్టిగేషన్ పూర్తయ్యాక వివరాలు ప్రజల ముందు పెడుతాం. పేలుడు సంభవించిన కారు హర్యానాలో రిజిష్టేషన్ అయ్యింది. హెచ్ఆర్267674 నంబర్‌తో నదామ్ ఖాన్ పేరుతో రిజిష్టర్ అయ్యింది. - కేంద్ర హోం మంత్రి అమిత్ షా

# మాయమైపోయాడు.. మన అందెశ్రీ



**తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ హఠాన్మరణం**

- గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించిన గాంధీ వైద్యులు
- 15 ఏళ్లుగా అధిక రక్తపోటుతో బాధపడుతున్న కవి
- గత నెల రోజులుగా బీపీ మందులు వాడటం లేదని వెల్లడి
- ఆరోగ్యంపై నిర్లక్ష్యమే విషాదానికి కారణమని డాక్టర్ల స్పష్టీకరణ
- నివాళులర్పించిన యావత్తు తెలంగాణ సమాజం, ప్రముఖులు

తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' రూపశిల్పి, ప్రముఖ ప్రజాకవి అందెశ్రీ (61) సోమవారం ఉదయం హఠాన్మరణం చెందారు. ఆదివారం రాత్రి ఆయన తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన.. ఇంట్లోనే ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. దీంతో, కుటుంబ సభ్యులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. సోమవారం ఉదయం 7:25 గంటలకు అందెశ్రీ చనిపోయినట్టు వైద్యులు వెల్లడించారు. ప్రజాకవి, ప్రకృతి కవిగా సుప్రసిద్ధులైన డాక్టర్ అందెశ్రీ ఉమ్మడి వరంగల్ జిల్లా జనగామలోని రేబర్తిలో జూలై 18, 1961లో జన్మించారు. ఆయన అసలు పేరు అందె ఎల్లయ్య. అందెశ్రీకి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అందెశ్రీ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. పాఠశాల చదువు లేకుండానే కవిగా రాణించారు. 'మాయమైపోతున్నడమ్మా' గీతంతో మంచి పేరు తెచ్చుకున్నారు.

లాలాగూడ/హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ'ను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రగీతంగా గుర్తించిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 2025 జూన్ 2న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా నగదు పురస్కారం అందుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ పొందారు. తెలంగాణ, ప్రకృతి వంటి అంశాలపై అందెశ్రీ గేయరచన చేశారు. ఈయన అశువు కవిత్వం చెప్పటంలో దిట్ట. 2006లో గంగ సినిమాకు గానూ నంది పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన రచనలు ప్రజలలో చైతన్యం నింపాయి. ఆయన రచనలు, పాటలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. 2014లో అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్, 2015లో దాశరథి సాహితీ పురస్కారం, 2015లో రావూరి తరువాయి 2 వ పేజీలో...

## కామినేని హాస్పిటల్‌కు రూ.కోటి జరిమానా

ఓ గర్భిణీకి వైద్యం చేయడంలో నిర్లక్ష్యం వహించి, చనిపోవడానికి కారణమైన కామినేని హాస్పిటల్‌కు నల్లగొండ జిల్లా వినియోగదారుల ఫోరం రూ.కోటి జరిమానా విధించింది. 2

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,382 |
| వెండి (గ్రాము): | రూ.169 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,462 |

## విశ్వవాణి



తాజా అధ్యయనం ప్రకారం.. 186 దేశాల్లోకెల్లా గయానా మాత్రమే సొంతంగా దేశ అవసరాలకు సరిపడా పంట ఉత్పత్తులను పండించుకొంటున్నది. దాదాపు 7 ఆహారోత్పత్తుల్లో ఈ దేశం అగ్రగామిగా ఉంది. దిగుమతులపై ఆధారపడకుండానే ఆ దేశ ప్రజలందరికీ తిండి పెట్టగలదు.




# కారా.. సర్కారా? ఓటరన్న ఎటు?

## నేడే జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్

**బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే పోటీ.. మూడో స్థానానికే బీజేపీ పరిమితం!**


రాష్ట్రం మొత్తం ఆసక్తిగా ఎదురు చూస్తున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక పోలింగ్‌కు రంగం సిద్ధమైంది. మంగళవారం ఉదయం ప్రారంభం కానున్న పోలింగ్‌ను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. యూసఫ్‌గూడలోని డీఆర్‌సీ సెంటర్‌లో ఈసీ అధికారులు సిబ్బందికి ఈవీఎంలు, పోలింగ్ స్టేషన్లు కేటాయించారు. సాయంత్రంలోగా ఎన్నికల సిబ్బంది పోలింగ్ స్టేషన్లకు చేరుకుంటారు. పోలింగ్ ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ పరిశీలించారు. ఈసారి డ్రోన్ల ద్వారా సెక్యూరిటీ మానిటరింగ్ చేస్తామని కర్ణన్ స్పష్టం చేశారు. ఒక్కో అభ్యర్థికి ఒక్కో పోలింగ్ ఏజెంట్ పాస్ అందించామని చెప్పారు.

జూబ్లీహిల్స్/హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): ఉప ఎన్నికకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. 139 ప్రాంతాలను డ్రోన్లతో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు వ్యక్తులు డ్రోన్లు ఎగరవేయడానికి అనుమతి లేదన్నారు. హెల్ప్‌లైన్ కోసం 1950 నంబర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కాగా, సోమవారం జూబ్లీహిల్స్ వెంకటగిరి కాలనీలో పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను ఆర్వీ కర్ణన్ పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికకు సంబంధించిన భద్రతా ఏర్పాట్ల కోసం డ్రోన్లు తరువాయి 2 వ పేజీలో...

# హైదరాబాద్‌కు టైమైంది!

**రెండో దేశ రాజధానిగా భాగ్యనగరం!?**

- ఢిల్లీ కాలుష్యం నేపథ్యంలో తెరపైకి డిమాండ్
- అంబేద్కర్ ప్రతిపాదన అమలు చేయాలని చర్చ



దేశానికి హైదరాబాద్‌ను రెండో రాజధాని చేయాల్సిన సమయం వచ్చేసిందా? ఢిల్లీ కాలుష్యం ప్రత్యామ్నాయ రాజధానిని చూసుకోవాలని సూచిస్తోందా? అంబేద్కర్ ప్రతిపాదించినట్లు హైదరాబాద్‌ను దేశానికి ఇంకో క్యాపిటల్‌గా ప్రకటించాల్సిందేనా? అంటే.. తాజా పరిణామాలు అవుననే అంటున్నాయి. ఢిల్లీలో కాలుష్యంతో పరిస్థితులు తలకిందులవుతున్నాయి. దేశ, విదేశీ ప్రముఖులు ఢిల్లీ కాలుష్యంపై పెదవి విరుస్తున్నారు. దీంతో ఢిల్లీకి ప్రత్యామ్నాయంగా, దక్షిణాదిన హైదరాబాద్‌ను రెండో రాజధానిగా చేయాల్సిందేనన్న డిమాండ్లు ఊపందుకున్నాయి.

(ఈవార్తలు స్పెషల్ బ్యూరో)

హైదరాబాద్‌ను భారతదేశానికి రెండవ రాజధానిగా మార్చాలనే ప్రతిపాదనలు చాలా కాలంగా వస్తున్నప్పటికీ, వాస్తవ రూపం దాల్చలేదు. 2014లో ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత, హైదరాబాద్ తెలంగాణకు మాత్రమే రాజధానిగా మారింది. 1950లలో భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఛైర్మన్‌గా ఉన్న అంబేద్కర్ కూడా హైదరాబాద్‌ను రెండవ రాజధానిగా ప్రతిపాదించారు, అయితే అది కార్యరూపం దాల్చలేదు. భారతదేశం వంటి విశాలమైన, వైవిధ్యమైన దేశంలో రాజధాని ఒక్కటే ఉండటం ద్వారా చాలా సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంటుందని నిపుణులు ఎప్పుడో చెప్పారు. ఢిల్లీ ఉత్తర భారతంలో ఉండటం వల్ల దక్షిణ, తూర్పు, పశ్చిమ ప్రాంతాలకు ఇబ్బంది తప్పదు అనేది వారి వాదన. ఇలాంటి సమస్యలకు పరిష్కారంగా హైదరాబాద్‌ను రెండో రాజధానిగా చేయాలన్న డిమాండ్ దశాబ్దాలుగా వస్తున్నది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఈ ఆలోచనకు మూలపురుషుడు. మొదట డాక్టర్ తరువాయి 2 వ పేజీలో...

# ఈ వస్తువు ఎక్కడ తయారైంది?

**కంట్రీ ఆఫ్ ఆరిజిన్ ఉండాల్సిందే.. సెర్చ్ ఫిల్టర్ తప్పనిసరి చేయాలి**

**ఈ-కామర్స్ సంస్థలకు కేంద్రం ఆదేశం**



న్యూఢిల్లీ: దేశీయ ఉత్పత్తులను.. ముఖ్యంగా స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఏ వస్తువు ఎక్కడ తయారైంది? అన్న విషయం వినియోగదారులకు తెలియాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఈ మేరకు దేశంలోని ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లకు కేంద్ర వినియోగదా రుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్యాకేజ్డ్ తరువాయి 2 వ పేజీలో...




# హైదరాబాద్‌కు మెస్సీ!

- డిసెంబర్‌లో భారత పర్యటనకు ఫుట్‌బాల్ దిగ్గజం
- ది గోట్ పోస్టర్ ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): ప్రపంచ ఫుట్‌బాల్‌లో అగ్రగామి ఆటగాడు, అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సీ ఈ డిసెంబర్‌లో భారత్ పర్యటనలో భాగంగా హైదరాబాద్‌ను సందర్శించనున్నారు. 'ది గోట్ ఇండియా టూర్-2025'లో తరువాయి 2 వ పేజీలో...

# 16 ఏళ్లలోపు సోషల్ మీడియా బ్యాన్!



**ఆస్ట్రేలియా సర్కారు కీలక నిర్ణయం**

**డిసెంబర్ 10 నుంచే ఆంక్షలు అమల్లోకి.. నిర్ణయంపై టెక్ దిగ్గజాలు ఆగ్రహం**

పిల్లల ఆన్‌లైన్ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆస్ట్రేలియా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా 16 సంవత్సరాలలోపు వయసున్న పిల్లలు సోషల్ మీడియాను వినియోగించడంపై నిషేధం విధిస్తున్నట్లు ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ప్రకటించారు.

సిడ్నీ: ఈ కొత్త నిబంధన ఈ ఏడాది డిసెంబర్ 10వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. ఈ మేరకు 'ఆన్‌లైన్ సేఫ్టీ అమెండ్‌మెంట్ (సోషల్ మీడియా మినిమమ్ ఏజ్) బిల్ 2024' పేరుతో ప్రభుత్వం ఒక కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం -2 వ పేజీలో...

## రాశి ఫలాలు
11.11.2025

మేషం: దైవదర్శనాలు చేసుకుంటారు. వృధా ఖర్చులు అదుపు చెయ్యడం మంచిది. వృత్తి, వ్యాపారాలు సాదాసీదాగా సాగుతాయి. మాతృ సంభంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. ఆర్థిక పరిస్థితి కొంత నిరాశ కలిగిస్తుంది.

వృషభం: సంతానం పోటీపరీక్షల్లో విజయం సాధిస్తారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. సన్నిహితుల నుండి శుభ వార్తలు అందుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆలయాలు సందర్శిస్తారు. నూతన వాహనయోగం ఉన్నది. వృత్తి, వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి.

మిధునం: ముఖ్యమైన పనులు కొన్ని వాయిదా పడుతాయి. కుటుంబ సభ్యులతో వివాదాలు చికాకు కలిగిస్తాయి. ధన పరమైన సమస్యలు బాధిస్తాయి. దైవ చింతన పెరుగుతుంది. చేపట్టిన పనులలో శ్రమ పడ్డా ఫలితం కనిపించదు. వ్యాపార, ఉద్యోగాలలో అనుకోని మార్పులు ఉంటాయి.

కర్కాటకం: ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. నూతన విషయాలపై ఆసక్తి పెరుగుతుంది. విద్యార్థులు ఆశించిన ఫలితాలు సాధిస్తారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. రాజకీయ ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. గృహమున ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటు చేసుకుంటాయి.

సింహం: పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపార పరంగా భాగస్థులతో వివాదాలు కలుగుతాయి. ముఖ్యమైన పనులు వ్యయప్రయాసలతో కానీ పూర్తికావు. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. ఆదాయ మార్గాలు మందగిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి.

కన్య: ఆప్తుల సలహాలతో ముందుకు సాగడం మంచిది. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఆకస్మిక ధన లాభాలు పొందుతారు. వ్యాపార, ఉద్యోగాలలో ప్రోత్సాహకర వాతావరణం ఉంటుంది. విలువైన వస్తులాభాలు పొందుతారు. చిన్ననాటి మిత్రుల కలయిక ఉత్సాహనిస్తుంది.

తుల: విద్యార్థులకు నూతన అవకాశములు అందుతాయి. వృత్తి, వ్యాపారాలు సజావుగా సాగుతాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు అందుతాయి. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. కుటుంబ సభ్యులతో శుభకార్యాలకు హాజరవుతారు.

వృశ్చికం: స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. కుటుంబంలో ఒత్తిడులు పెరుగుతాయి. ముఖ్యమైన పనులలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప నష్టాలు తప్పవు. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు నిరాశ కలిగిస్తాయి. ఇంటా బయట బాధ్యతలు మరింతగా పెరుగుతాయి.

ధనస్సు: సంతాన ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. వృత్తి, వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఇతరులకు ధన పరంగా మాట ఇవ్వడం మంచిది కాదు.

మకరం: చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. సంఘంలో గౌరవమర్యాదలు పెరుగుతాయి. ఆప్తుల నుండి విలువైన సమాచారం అందుతుంది. కుటుంబంలో శుభకార్యాలు నిర్వహిస్తారు. వృత్తి, వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. బంధు మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఆర్థికాభివృద్ధి కలుగుతుంది.

కుంభం: కీలక సమయంలో సన్నిహితుల సాయం అందుతుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన పనులలో శ్రమ ఫలిస్తుంది. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఉద్యోగాలలో హెూదాలు పెరుగుతాయి. సంతాన విద్య ఉద్యోగ విషయంలో శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది.

మీనం: ఉద్యోగాలలో అధికారులతో కొద్దిపాటి వివాదాలు తప్పవు. ఆర్థిక లావాదేవీలు అంతంత మాత్రంగా ఉంటాయి. అనుకోని ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. చేపట్టిన పనులలో తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం మంచిది కాదు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు వాయిదా పడుతాయి.

# ఎరుపెక్కిన ఎర్రకోట



న్యూఢిల్లీ: రాజధాని ఢిల్లీలో సోమవారం సాయంత్రం సుమారు 6.52 గంటల సమయంలో జరిగిన బ్లాస్ట్ యావత్ భారతాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఎర్రకోట సమీపంలోని సుభాష్ మార్గ్ సిగ్నల్ వద్ద కారు పేలడంతో 10 వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పేలుళ్లలో 11 మంది మృతి చెందగా.. 24 మంది తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు తీవ్రత నేపథ్యంలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ పేలుడు ఘటనకు సంబంధించి ఇద్దరు అనుమానితులను పోలీసులు అరెస్టు చేశారు. సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారని.. పేలుడు ఉద్దేశపూర్వకంగా జరిగిందా? లేదంటే ప్రమాదవశాత్తు జరిగిందా? అనే కోణంలో ఆరా తీస్తున్నట్లుగా సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. నెమ్మదిగా కదులుతున్న వాహనంలో పేలుడు సంభవించిందని.. కారు సిగ్నల్ వద్దకు రాగానే పేలుడు జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ సమయంలో కారులో ఇద్దరు, ముగ్గురు ఉన్నట్లుగా ఢిల్లీ పోలీస్ కమిషనర్ సతీశ్ గోల్చా పేర్కొన్నారు.

### రంగంలోకి దర్యాప్తు సంస్థలు

పేలుడు ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాకు మోడీ ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. మరోవైపు పేలుడు ఘటనపై అమిత్ షా విచారణకు ఆదేశించారు. ఎన్ఐఏ, ఎన్ఎస్‌జీ, ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ దర్యాప్తునకు ఆదేశించారు. 2011లో ఢిల్లీ హైకోర్టు దగ్గర జరిగిన పేలుళ్ల, అంటే దాదాపు 14 సంవత్సరాల తరవాత ఢిల్లీలో పేలుళ్లు జరగడం ఇదేతొలిసారి. టెర్రరిస్టుల పనే అయి ఉంటుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దరియా గంజ్ నుంచి ఎర్రకోట వరకు వాహనాల రాకపోకలు నిలిపివేశారు. ఢిల్లీ స్పెషల్ సెల్ టీం, క్లూస్ టీంలు, ఫోరెన్సిక్ నిపుణులు సంఘటనా స్థలం నుంచి శాంపిల్స్ సేకరిస్తున్నారు. పేలుడు ఘటన వెనుక ఉగ్రవాదుల హస్తం ఉందా? అనే కోణంలో దర్యాప్తు బృందాలు దర్యాప్తు ప్రారంభించాయి. ఢిల్లీ పోలీసు విభాగానికి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం సహా క్లూస్ టీమ్, ఎన్ఐఏ రంగంలోకి దిగాయి. కారులో పేలుడు పదార్థాలని ఉంచి రిమోట్ సాయంతో పేల్చారా? అని అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సోమవారం ఢిల్లీలో పర్యాటక ప్రదేశాలు, మార్కెట్లకి సెలవు.. దీంతో ప్రమాద తీవ్రత తక్కువగా ఉందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరిస్తున్నారు.

### దేశమంతా హై అలర్ట్

దేశ రాజధానిలో పేలుడుతో కేంద్ర హెూంమంత్రిత్వశాఖ అప్రమత్తమైంది. పలు రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా పలు నగరాల్లో హై అలెర్ట్ ప్రకటించారు. ముంబై, హైదరాబాద్, లక్నో సహా పలు నగరాల్లో హై అలెర్ట్ ప్రకటించిన విస్తృత సోదాలు నిర్వహిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందలు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో రద్దీ ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు, నాకాబందీ చేపట్టాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆదేశాలు జారీ చేశారు. మరేవైనా వస్తువులు కనిపించినా సమాచారం ఇవ్వాలని సజ్జనార్ కోరారు. డయల్ 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైల్వేస్టేషన్లలోనూ తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంతో పాటు యావత్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లకు కీలక ఆదేశాలు జారీ అయ్యాయి. సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు.

అటు.. ముంబై నగరం అంతటా భద్రతను పెంచారు. పెట్రోలింగ్, నాకాబందీ ఏర్పాటు చేశారు. పేలుడు సమాచారం అందుకున్న వెంటనే ముంబైలోని అన్ని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేసి, జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు. రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, ఆధ్యాత్మిక ప్రదేశాలు, పర్యాటక ప్రాంతాలు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, సున్నిత ప్రదేశాల్లో గస్తీని పెంచాలని ఆదేశించారు. కీలకమైన జంక్షన్లలో నాకాబందీ నిర్వహించనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఏదైనా ముప్పును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని.. గ్రౌండ్ ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను పూర్తిగా ఉపయోగించుకోవాలని ఆదేశించారు.

## హైదరాబాద్‌కు మెస్సీ!

**మొదటి పేజీ తరువాయి**

భాగంగా మెస్సీ హైదరాబాద్ రానున్నట్లు సమాచారం. ఈ మేరకు తాజాగా ది గోట్ ఇండియా టూర్ ప్రతినిధులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి పోస్టర్ విడుదల చేశారు. తెలంగాణ అభివృద్ధి కార్యక్రమాలను అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమానికి మెస్సీని గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఆహ్వానించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇక, మెస్సీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు సమాచారం.

## కామినేని హాస్పిటల్‌కు రూ.కోటి జరిమానా

నార్కట్‌పల్లి, నవంబర్ 10 (ఈవార్తలు): ఓ గర్భిణీకి వైద్యం చేయడంలో నిర్లక్ష్యం వహించి, చనిపోవడానికి కారణమైన కామినేని హాస్పిటల్‌కు నల్లగొండ జిల్లా వినియోగదారుల ఫోరం రూ.కోటి జరిమానా విధించింది. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన అసనాల స్వాతిని 2018 జూలై 9 న డెలివరీ కోసం కుటుంబ సభ్యులు నార్కట్‌పల్లి కామినేని హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు. జూలై 13 రాత్రి ఆమెకు సర్జరీ చేసిన వైద్యులు రెండు సార్లు మత్తు మందు ఇవ్వడంతో వైద్యం వికటించి 14 వ తేదీన మృతి చెందింది. ఈ విషయంపై బాధితురాలి కుటుంబ సభ్యులు అనుమానం వచ్చి విచారించగా.. ఆసుపత్రి వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వైద్యం చేయడం వల్లే ఆమె మృతి చెందినట్లు తెలిసింది. దీంతో బాధితులు నల్లగొండ వినియోగదారుల ఫోరం కోర్టులో కేసు వేశారు. కేసు విచారణ అనంతరం వినియోగదారుల ఫోరం.. కామినేని దవాఖాన యాజమాన్యానికి రూ.కోటి జరిమానా విధించింది.

# కారా.. సర్కారా? ఓటరన్న ఎటు?

**మొదటి పేజీ తరువాయి**

ఉపయోగించనున్నారు. ఎన్నికల నిర్వహణలో డ్రోన్లు వాడటం ఇదే మొదటిసారి. 139 పోలింగ్ లొకేషన్స్ లో 139 డ్రోన్లను వినియోగించనున్నారు. డ్రోన్ల నుంచి వచ్చే ఫీడ్ లైవ్ స్ట్రీమింగ్ ద్వారా కంట్రోల్ రూమ్‌కి అనుసంధానం చేయనున్నారు. విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో డ్రోన్లను చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ పరిశీలించారు. ఢిల్లీ పేలుడుతో కేంద్ర హెూంమంత్రిత్వశాఖ అప్రమత్తమైంది. పలు రాష్ట్రాలను సైతం అప్రమత్తం చేసింది. ఇదే సమయంలో మంగళవారం ఎన్నికలు జరిగే హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ లో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పలు కార్లను, అనుమానిత వాహనాలను పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. పాతబస్తీలో అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు ప్రారంభించారు. ప్రధానంగా హైదరాబాద్ పాత నగరం నాకాబందీతో పాటు ఇతర రద్దీ ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఢిల్లీ పేలుళ్ల దృష్ట్యా హైదరాబాద్ సిటీ కమిషనర్ వీసీ సజ్జనార్ నగర ప్రజలకు కీలక విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

# హైదరాబాద్‌కు టైమైంది!

**మొదటి పేజీ తరువాయి**

అంబేద్కర్ 1955లో ప్రచురించిన "థాట్స్ ఆన్ లింగ్విస్టిక్ స్టేట్స్" పుస్తకంలో హైదరాబాద్‌ను రెండో క్యాపిటల్ అన్న అంశాన్ని ప్రస్తావించారు. పాకిస్థాన్ (300 కి.మీ.), చైనా (500 కి.మీ.) సరిహద్దులకు ఢిల్లీ సమీపంలో ఉండటం దేశ భద్రతకు ప్రమాదకరమని, రెండో రాజధాని అవసరమని వాదించారు. దక్షిణ-మధ్య భారతంలో ఉండి, ఉత్తర-దక్షిణ విభేదాలను తగ్గించి, దేశవ్యాప్త అభివృద్ధికి సహాయపడటంలో హైదరాబాద్ కీలకం అని అంబేద్కర్ చెప్పారు. 1950లలోనే హైదరాబాద్ అభివృద్ధి చెందిన నగరంగా ఉండటం, దాని వాతావరణం, భౌగోళిక స్థానం దీనికి ఆధారాలు. ఈ ఆలోచన 2013లో ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో మళ్లీ బలపడింది. తెలుగుదేశం పార్టీ (టీడీపీ), కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌ను యూనియన్ టెరిటరీగా లేదా రెండో రాజధానిగా చేయాలని డిమాండ్ చేశారు. ఏపీలో రాజధాని లేకపోవటం వల్ల ఈ డిమాండ్ బలపడింది. 2023లో బీజేపీ సీనియర్ నాయకుడు విద్యాసాగర్ రావు మళ్లీ ఈ డిమాండ్‌ను లేవనెత్తారు. అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ కూడా తెలంగాణ ప్రభుత్వానికి ఈ డిమాండ్ చేయాలని సూచించారు.

హైదరాబాదే ఎందుకు?

హైదరాబాద్ ఐటీ, ఫార్మా, బయోటెక్ హబ్. హైటెక్ సిటీ, ఫార్చ్యూన్ 500 కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. ఇది ఇప్పటికే అంతర్జాతీయ పార్లమెంటరీ యూనియన్ సభలకు వేదికగా మారింది. ఢిల్లీ పొగమంచు సమస్యలు ఎదుర్కొంటుండగా, హైదరాబాద్ మితమైన వాతావరణం కలిగి ఉంది. హైదరాబాద్‌ను రెండో రాజధానిగా చేస్తే మరిన్ని పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తాయి. రియల్ ఎస్టేట్ ధరలు పెరగవచ్చు, కానీ అభివృద్ధి వేగవంతమవుతుంది. దక్షిణ ప్రాంతాల నుంచి ప్రజలు, రాజకీయవేత్తలు సులభంగా చేరుకోగలరు. పార్లమెంటు సెషన్లు రెండు చోట్ల జరిగి, రవాణా ఖర్చులు తగ్గుతాయి. ఉత్తర-దక్షిణ విభేదాలు తగ్గి, దేశ ఐక్యత పెరుగుతుంది అనేది నిపుణుల అభిప్రాయం.

ప్రతికూలతలు: తెలంగాణకు హైదరాబాద్ రాజధానిగా ఉంది. దీన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్తే, స్థానిక హక్కులు ప్రభావితమవుతాయని భయం. కొత్త భవనాలు, మౌలిక సదుపాయాలు నిర్మాణానికి లక్షల కోట్లు ఖర్చవుతాయి. ఢిల్లీలోని సంస్థలు మార్చడం కష్టం. 2014 ఏపీ రీఆర్గనైజేషన్ యాక్ట్ ప్రకారం, హైదరాబాద్ 2024 జూన్ వరకు రెండు రాష్ట్రాల సామాన్య రాజధాని. ఇప్పుడు తెలంగాణకు పూర్తిగా చెందినా, జాతీయ రాజధానిగా మార్చడానికి సవరణలు అవసరం. ఉత్తర భారతంలో ఈ డిమాండ్‌కు వ్యతిరేకత ఉండవచ్చు, దక్షిణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు కనిపిస్తుంది.

## ఈ వస్తువు ఎక్కడ తయారైంది?

**మొదటి పేజీ తరువాయి**

వస్తువులు, ఉత్పత్తులకు సంబంధించి 'కంట్రీ ఆఫ్ ఆరిజిన్ (వస్తువు తయారైన దేశం)' ఆధారంగా సెర్చ్ చేసే ఫిల్టర్‌ను తప్పనిసరి చేయాలని సూచించింది. దీనివల్ల డిజిటల్ మార్కెట్‌లలో పారదర్శకత పెరుగుతుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది. వినియోగదారులు ఆన్‌లైన్‌లో షాపింగ్ చేస్తున్నప్పుడు ఉత్పత్తుల మూలాన్ని సులభంగా గుర్తించేలా చేయడం ద్వారా సరైన సమాచారం ఆధారంగా కొనుగోలు చేయడానికి వీలవుతుందని ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్రం చెప్తోంది. ప్రభుత్వం ఓ ప్రకటనలో డ్రాఫ్ట్ లీగల్ మెట్రాలజీ (ప్యాకేజ్డ్ కమోడిటీస్) (రెండవ) సవరణ నియమాలు-2025 ద్వారా ప్రస్తుత ప్యాకేజింగ్ నియమాలను మార్చాలని యోచిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ ఫీచర్ ద్వారా ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో అవసరమైన సమాచారాన్ని గుర్తించడం సులభం అవుతుంది. దీనిపై ప్రజాభిప్రాయం కోసం మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌లో పబ్లిష్ చేసింది. ఈ నెల 22 వరకు అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. 'మేడిన్ ఇండియా' ఉత్పత్తులను సులభంగా కనుగొనే వీలు కల్పించడం ద్వారా ఆత్మనిర్భర్ భారత్, వోకల్ ఫర్ లోకల్ కార్యక్రమాల లక్ష్యానికి మద్దతు లభిస్తుందని కేంద్రం వెల్లడించింది.

## 16 ఏళ్లలోపు సోషల్ మీడియా బ్యాన్!

**మొదటి పేజీ తరువాయి**




ప్రకారం 16 ఏళ్లలోపు మైనర్లు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్, స్నాప్‌చాట్, ఎక్స్ (గతంలో ట్విట్టర్), యూట్యూబ్, రెడ్డిట్, కిక్ వంటి ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో అకౌంట్లు తెరవడం లేదా వాటిని వినియోగించడం చట్టవిరుద్ధం అవుతుంది. ఆన్‌లైన్‌లో పిల్లలు ఎదుర్కొంటున్న ప్రమాదాల నుంచి వారిని రక్షించేందుకే ఈ కఠినమైన నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ముఖ్యంగా సైబర్ బుల్లీయింగ్, హానికరమైన కంటెంట్ ప్రభావం, సోషల్ మీడియా అల్గారిథమ్‌ల వల్ల కలిగే వ్యసనం వంటి సమస్యల నుంచి పిల్లలను కాపాడటమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వ వర్గాలు వివరించాయి. ఈ నిర్ణయం ద్వారా పిల్లలకు సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని అందించాలని ఆస్ట్రేలియా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా పిల్లలు .. సోషల్ మీడియాపై అతిగా ఆధారపడుతున్నారు. ఆధారపడుతున్నారు అనడం కన్నా.. బానిసలవుతున్నారని కొత్త అధ్యయనాలు చెబుతున్నాయి. దీని కారణంగా వారి చదువు, ఆరోగ్యం .. విలువైన బాల్యాన్ని కూడా కోల్పోతున్నారు. దీనికి తోడు బుల్లీయింగ్ .. వారిని ప్రమాద పరిస్థితుల్లో పడేస్తోంది. వీటన్నింటి నుంచి వారిని రక్షించేందుకు ఆస్ట్రేలియా ప్రభుత్వం ఈ కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది.

# మాయమైపోయాడు.. మన అందెశ్రీ

**మొదటి పేజీ తరువాయి**

భరద్వాజ సాహితీ పురస్కారం, 2022లో నకమ్మ జాతీయ పురస్కారం, 2024లో దాశరథీ కృష్ణమాచార్య సాహితీ పురస్కారం, లోక్ నాయక్ పురస్కారం, అదేవిధంగా కాకతీయ యూనివర్సిటీ నుంచి అందెశ్రీ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

### ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం వల్లే..



గాంధీ ఆసుపత్రి హెచ్‌వోడీ డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ సింధూర ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. అందెశ్రీ గత 15 ఏళ్లుగా తీవ్రమైన రక్తపోటు (హైపర్‌టెన్షన్) సమస్యతో బాధపడుతున్నారని తెలిపారు. అయితే, గత నెల రోజులుగా ఆయన రక్తపోటును నియంత్రించే మందులను వాడటం లేదని కుటుంబసభ్యుల ద్వారా తెలిసిందన్నారు. గత మూడు రోజులుగా అనారోగ్యంతో ఉన్నప్పటికీ ఆయన ఆసుపత్రికి వెళ్లలేదని పేర్కొన్నారు.

### కోరిక నెరవేరకుండానే..

అందెశ్రీ ఎంతో ఇష్టంతో, ఆశగా నిర్మించుకుంటున్న తన 'కలల సౌధం' పూర్తి కాకముందే ఈ లోకాన్ని విడిచివెళ్లడం బాధాకరం. అందెశ్రీ తన జీవిత చరమాంకంలో కొత్త ఇంటి నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయన రాసిన 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించిన సందర్భంగా.. ఆయనకు కోటి రూపాయల నజరానాతో పాటు, ఇంటి నిర్మాణానికి అవసరమైన 348 గజాల స్థలాన్ని కూడా బహుకరించింది. ఆయన మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీ నగర్‌లోని ఆ స్థలంలో జీ3 పెంట్ హౌస్ నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. అందెశ్రీకి ఆ ఇంటి నిర్మాణంపై ఎంత మమకారం ఉందంటే.. చనిపోయే ముందు రోజు 2025, నవంబర్ 09వ తేదీ సాయంత్రం వరకు ఆయన అక్కడే గడిపారు. తానే స్వయంగా దగ్గర ఉండి నిర్మాణ పనులను పర్యవేక్షించి వెళ్లినట్లు మేస్త్రీలు, కాంట్రాక్టర్లు , కుటుంబ సభ్యులు తెలిపారు. నవంబర్ 9వ తేదీ సాయంత్రం కొత్త ఇంటి పనులను పర్యవేక్షించిన అనంతరం.. ఆయన అయోధ్య రెడ్డి ఇంటి దగ్గర జరిగిన అయ్యప్ప పూజ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ తర్వాత హైదరాబాద్ లాలాగూడలోని తన ఇంటికి చేరుకున్నారు. నవంబర్ 10వ తేదీ ఉదయం అర్ధరాత్రి తర్వాత ఆయనకు తీవ్ర గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు.

### ప్రముఖుల నివాళి

అందెశ్రీ మరణం పట్ల ప్రధాని మోదీతో సహా పలువురు రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ప్రధాని తమ ట్వీట్‌లో అందెశ్రీ మరణం మన సాంస్కృతిక, మేధో ప్రపంచంలో పూడ్చలేని లోటని పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయన్నారు. ఒక గొప్ప కవి, మేధావి అని కొనియాడారు. ప్రజల పోరాటాలకు, ఆకాంక్షలకు, అకుంఠిత స్ఫూర్తికి గొంతుకగా నిలిచారని గుర్తుచేసుకున్నారు. ఆయన సామాజిక స్పృహను, సాహితీ సౌందర్యంతో మిళితం చేసిన విధానం అద్వితీయమని ప్రధాని కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ ఓం శాంతి అని పేర్కొన్నారు. అటు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే సైతం సంతాపం తెలిపారు. అందెశ్రీ మరణం తెలంగాణ సాంస్కృతిక, సాహిత్య రంగంలో లోటును మిగిల్చిందన్నారు. పేదల పక్షాన, అట్టడుగు వర్గాల పక్షాన నిలబడిన నేల బిడ్డ, ప్రతిభావంతుడైన కవి అయిన ఆయన మాటలు తెలంగాణ ఉద్యమానికి గుండె చప్పుడుగా మారాయన్నారు. 'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం' పాట ద్వారా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ఎప్పటికీ ప్రతిధ్వనించే రాష్ట్ర గీతాన్ని ఆయన అందించారని ఖర్గే నివాళులర్పించారు.

### అంత్యక్రియలకు సీఎం రేవంత్

అందెశ్రీ ఆకస్మిక మరణం పట్ల సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో.. సాహిత్య ప్రస్థానంలో అందెశ్రీ పాత్ర చిరస్మరణీయమని ఆయన కొనియాడారు. ఆయన మరణం తెలంగాణ సాహిత్యానికి తీరని లోటని అన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అందెశ్రీ అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# జూబ్లీహిల్స్ ఓటర్లు కారువైపే

## రేవంత్ రెడ్డి ఎన్ని డ్రామాలు ఆడినా కాంగ్రెస్‌కు ఓటమే.. మాజీమంత్రి హరీశ్ రావు

హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని నాటకాలు ఆడినా జూబ్లీహిల్స్ ఓటర్లు ఎవరికి ఓటు వేయాలో ముందే నిర్ణయించుకున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్యం, డబ్బును విచ్చలవిడిగా పంపిణీ చేస్తోందని ఆయన ఆరోపించారు. లక్షకు పైగా చీరలు, మిక్సీలను ఓటర్లకు ఎరగా వేస్తోందని అన్నారు. ఈ మేరకు పార్టీ నాయకులతో కలిసి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, అన్ని వీడియో, ఫొటోల ఆధారాలను ఎన్నికల సంఘానికి అందజేసినట్లు తెలిపారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈసీని కోరినట్లు చెప్పారు. సీ-విజిల్ యాప్‌లోనూ ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఫిర్యాదు చేసినప్పటికీ కొందరు పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఓటర్లు అధికార పార్టీకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హరీశ్ రావు అన్నారు. అధికార దుర్వినియోగంపై ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలను మోహరించాలని కోరుతూ ఆయా బూత్‌ల వివరాలను సమర్పించినట్లు వెల్లడించారు. ముఖ్యంగా మహిళా పోలీసు అధికారులు, ఆశా, అంగన్వాడీ వర్కర్లను ఆయా చోట్ల నియమించాలని కోరామని అన్నారు. మహిళా ఓటర్ల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. నకిలీ ఓటరు కార్డులు తయారు చేశారని, ఇందుకు సంబంధించిన వీడియోలను ఎన్నికల అధికారికి ఇచ్చినట్లు తెలిపారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం నుంచి హామీ వచ్చినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతో




# అందెశ్రీ మరణం తెలంగాణకు తీరని లోటు

సీఎం రేవంత్, కేసీఆర్, కేటీఆర్ సంతాపం

హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): ప్రముఖ కవి, తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' రూపశిల్పి అందెశ్రీ ఆకస్మికంగా కన్నుమూశారు. ఆయన మరణవార్తతో తెలంగాణ సాహితీ లోకం దిగ్భ్రాంతికి గురైంది. అందెశ్రీ మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర గీతాన్ని రాసిన సమయంలో ఆయనతో జరిపిన సంభాషణలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలిందని, స్వరాష్ట్ర సాధనలో ఆయన చేసిన కృషి చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా అందెశ్రీ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన సాంస్కృతిక ఉద్యమంలో తన పాటలతో, సాహిత్యంతో అందెశ్రీ కీలక పాత్ర పోషించారని అన్నారు. ఉద్యమ కాలంలో ఆయనతో తనకున్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. ఆయన మరణం తెలంగాణకు తీరని లోటని పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం అందెశ్రీ మరణం పట్ల సంతాపం ప్రకటించారు. ఆయన మరణం తెలంగాణ సాహితీ రంగానికి, రాష్ట్రానికి పూడ్చలేని నష్టమని తెలిపారు. శోకసముద్రంలో మునిగిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.


# 80 కొత్త రకాల సీతాకోకచిలుకలు

**ములుగు అడవుల్లో అందమైన అద్భుతం**

**ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజుల సర్వే**

**లక్నవరం, తాడ్వాయి, పస్రా అభయారణ్యాల్లో పరిశోధన**

ములుగు, నవంబర్ 10 (ఈవార్తలు): తెలంగాణ జీవవైవిధ్యంలో మరో కొత్త అధ్యాయం మొదలైంది. ములుగు జిల్లా అభయారణ్యంలో ఏకంగా 80 రకాల అరుదైన సీతాకోకచిలుక జాతులను గుర్తించినట్లు ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ వెల్లడించింది. అటవీ శాఖ పర్యవేక్షణలో చేపట్టిన ప్రత్యేక సర్వేలో ఈ విషయం బయటపడింది. ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ అధ్యక్షుడు ఇందారం నాగేశ్వరరావు ఈ వివరాలను తెలియజేశారు. లక్నవరం, తాడ్వాయి, పస్రా అటవీ ప్రాంతాల్లో మూడు రోజుల పాటు



ఈ పరిశోధన నిర్వహించినట్లు ఆయన చెప్పారు. ఈ సర్వేలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 60 మందికి పైగా పరిశోధకులు, వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్లు, పర్యావరణవేత్తలు పాల్గొన్నారని వివరించారు. తెలంగాణలో ఇప్పటివరకు 150కి పైగా సీతాకోకచిలుక జాతులు ఉన్నాయని, తాజాగా గుర్తించిన 80 జాతులతో వాటి సంఖ్య మరింత పెరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో సీతాకోకచిలుకలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఎన్నో అరుదైన జాతులను గుర్తించి, వాటి మనుగడకు కృషి చేస్తున్న పర్యావరణవేత్తలు, స్వచ్ఛంద సంస్థల సేవలను ఆయన అభినందించారు. ఈ కొత్త ఆవిష్కరణ ములుగు అడవుల జీవవైవిధ్యానికి నిదర్శనమని పర్యావరణ ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# గజగజ వణుకుతున్న తెలంగాణ

**మరింత పెరగనున్న చలి తీవ్రత**

**మూడ్రోజుల్లో ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశం**



హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): రాష్ట్రాన్ని చలి గజగజ వణికిస్తోంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తక్కువగా నమోదవుతుండగా, రానున్న మూడు రోజులు చలి తీవ్రత మరింత పెరగనుందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. నేడు, రేపు, ఎల్లుండి సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీల సెల్సియస్ మేర ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ ఏడాది రాష్ట్రంలో అధిక వర్షపాతం నమోదు కావడం, దానికి తోడు ప్రస్తుతం ఉత్తర, ఈశాన్య ప్రాంతాల నుంచి చల్లని గాలులు తెలంగాణ వైపు వీస్తుండటమే చలి తీవ్రత పెరగడానికి ప్రధాన కారణాలని వాతావరణ శాఖ అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ గాలుల ప్రభావంతో రాష్ట్రంలో కొన్ని రోజులుగా పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. ఆదివారం తెల్లవారుజామున రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. హనుమకొండలో సాధారణం కన్నా ఏకంగా 4.2 డిగ్రీలు తగ్గి 16 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. అదేవిధంగా, పటాన్‌చెరులో 3.6 డిగ్రీలు తగ్గి 13.2, మెదక్‌లో 3.5 డిగ్రీలు తగ్గి 14.1, హైదరాబాద్‌లో 1.6 డిగ్రీలు తగ్గి 16.9 డిగ్రీల సెల్సియస్‌గా రికార్డయింది. ఆదిలాబాద్‌లో 14.2, హయత్‌నగర్‌లో 15.6 డిగ్రీల చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాత్రిపూట మాత్రమే కాకుండా పగటి ఉష్ణోగ్రతలు కూడా తగ్గుముఖం పట్టాయి. ఆదివారం రామగుండంలో గరిష్ఠ ఉష్ణోగ్రత సాధారణం కన్నా 3 డిగ్రీలు పడిపోయి 29 డిగ్రీలుగా నమోదైంది. నిజామాబాద్‌లో 30.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 29.2 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. మొత్తంమీద, రాష్ట్రవ్యాప్తంగా చలి ప్రభావం స్పష్టంగా కనిపిస్తుండటంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

# బాగుంది అన్నా.. గతం కంటే అనలేదు

**తిరుమల అన్నప్రసాదంపై నా వ్యాఖ్యలను వక్రీకరించారు**

**మీడియాపై అంబటి రాంబాబు ఫైర్**



తిరుమల, నవంబర్ 10 (ఈవార్తలు): వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబు, తిరుమల అన్నప్రసాదంపై తాను చేసిన వ్యాఖ్యలను కొన్ని మీడియా సంస్థలు ఉద్దేశపూర్వకంగా వక్రీకరించి ప్రసారం చేశాయంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భగవంతుడిపై భక్తితో తాను చేసిన వీడియోను రాజకీయాలకు వాడుకోవడంపై మండిపడ్డ ఆయన, ఇలాంటి దుష్ప్రచారాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అంబటి రాంబాబు, అనంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భోజనం చేశారు. అక్కడి ఏర్పాట్లు, భోజన నాణ్యత చూసి ఆయన ముగ్ధులయ్యారు. రోజుకు సగటున 90 వేల మందికి, కొన్ని ప్రత్యేక రోజుల్లో లక్షన్నర మందికి కూడా ఎంతో శుచిగా, రుచికరంగా భోజనం అందించడం అద్భుతమని ప్రశంసించారు. ఈ అనుభవాన్ని వివరిస్తూ తన యూట్యూబ్ ఛానల్‌లో ఓ వీడియోను కూడా పోస్ట్ చేశారు. అయితే ఏబీఎన్, టీవీ5, మహా టీవీ వంటి కొన్ని ఛానళ్లు తన వీడియోలోని క్లిప్పింగులను తీసుకుని, దానికి రాజకీయ రంగు పులిమాయని అంబటి ఆరోపించారు. తాను కేవలం "అన్నప్రసాదం చాలా బాగుంది" అని మాత్రమే అన్నానని, కానీ ఆ ఛానళ్లు మాత్రం "గతంలో కంటే ఇప్పుడు బాగుంది" అని తాను అన్నట్లుగా ప్రచారం చేశాయని మండిపడ్డారు. ఈ విధంగా తన ప్రశంసలను ప్రస్తుత టీటీడీ బోర్డుకు, దాని ఛైర్మన్ బీఆర్ నాయుడుకు ఆపాదిస్తూ ఆ మీడియా సంస్థలు 'శునకానందం' పొందుతున్నాయని తీవ్రస్థాయిలో విమర్శించారు.



# కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్.. ఖాకీలకు మొట్టికాయలు

**ఆ సెక్షన్లు కేసుకు సరిపోలడం లేదన్న హైకోర్టు**

హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు నేడు విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన సెక్షన్లు ఈ కేసుకు సరిపోవడం లేదని హైకోర్టు వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. రాజకీయ కక్షల కారణంగానే ఈ కేసు నమోదు చేశారని కేటీఆర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే, ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకే కేసు నమోదు చేసినట్లు పోలీసుల తరఫు న్యాయవాది వాదించారు. ఎలాంటి అనుమతులు లేకుండా అమరవీరుల స్మారకం వద్ద గోరటి వెంకన్నను కేటీఆర్ ఇంటర్వ్యూ చేశారని, అందులో బీఆర్ఎస్‌కు లబ్ధి చేకూరేలా అంశాలు ఉన్నాయని వాదనలు వినిపించారు. అంతేకాకుండా, అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేశారని తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు, ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన సెక్షన్లు ప్రస్తుత కేసుకు సరిపోవడం లేదని వ్యాఖ్యానిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

# ఏపీలోని ప్రభుత్వ ఆసుపత్రులకు కొత్త వైద్యులు

**227 మంది స్పెషలిస్టులకు పోస్టింగ్‌లు**

అమరావతి, నవంబర్ 10 (ఈవార్తలు): రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో స్పెషలిస్ట్ వైద్యుల కొరతను నివారించేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పీజీ విద్యను పూర్తి చేసుకున్న 227 మంది వైద్యులకు రాష్ట్రవ్యాప్తంగా 142 సెకండరీ ఆసుపత్రులలో పోస్టింగ్‌లు ఇచ్చినట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ నియామకాలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఇన్‌సర్వీస్ కోటాలో 12 వేర్వేరు విభాగాల్లో పీజీ పూర్తి చేసిన ఈ వైద్యులను కౌన్సెలింగ్ ద్వారా పారదర్శకంగా కేటాయించినట్లు మంత్రి వివరించారు. వీరిలో 33 ఏరియా ఆసుపత్రులలో 60 మంది, ఏడు జిల్లా ఆసుపత్రులలో 10 మంది, రెండు ఎంసీహెచ్ ఆసుపత్రులలో ఇద్దరు స్పెషలిస్టులకు




పోస్టింగ్‌లు ఇచ్చారు. అత్యధికంగా గూడూరు ఏరియా ఆసుపత్రికి నలుగురు స్పెషలిస్టులను కేటాయించారు. వీరిలో చిన్నపిల్లల వైద్యుడు, రేడియాలజిస్ట్, చర్మవ్యాధి నిపుణుడు, పాథాలజిస్ట్ ఉన్నారు. నియమితులైన 227 మందిలో గైనకాలజీ, జనరల్ మెడిసిన్ విభాగాల్లో 35 మంది చొప్పున, జనరల్ సర్జరీలో 30 మంది, మత్తు వైద్యులు 26 మంది, చిన్నపిల్లల వైద్య నిపుణులు 25 మంది, ఎముకల వైద్యులు 18 మంది, రేడియాలజిస్టులు 17 మంది, కంటి, ఈఎన్‌టీ వైద్య నిపుణులు కూడా ఉన్నారు. 2022-23లో ఇన్‌సర్వీస్ కోటాలో పీజీ కోర్సుల్లో చేరిన 257 మంది పీహెచ్‌సీ వైద్యులు ఇటీవల తమ కోర్సులు పూర్తి చేశారు. వారిలో 227 మందిని సెకండరీ ఆసుపత్రులలో నియమించగా, ఖాళీలు లేకపోవడంతో మిగిలిన 30 మందికి డీఎంఈ పరిధిలోని ఆసుపత్రులలో ట్యూటర్లుగా అవకాశం కల్పించినట్లు మంత్రి తెలిపారు. ఈ నియామకాలతో పాటు త్వరలోనే కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు 155 మంది, 100 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మరో 155 మంది స్పెషలిస్ట్ వైద్యులు విధుల్లో చేరతారని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఈ పోస్టింగ్‌లకు సంబంధించిన పూర్తి వివరాలను సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధర్‌బాబు, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డా. పద్మావతి మంత్రికి వివరించారు.

# రిజర్వేషన్ల సాధనకు 'హలో బీసీ.. చలో ఢిల్లీ'

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య**

బషీర్‌బాగ్, నవంబర్ 10 (ఈవార్తలు): తెలంగాణ ఉద్యమం తరహాలో బీసీ ఉద్యమాన్ని జాతీయ స్థాయిలో తీవ్రతరం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి బానాల అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం నిర్వహించనున్న 'హలో బీసీ.. చలో దిల్లీ' కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ నెల 10న దిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో బీసీ డిమాండ్లపై నిర్వహిస్తున్న సదస్సులో తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రానికి చెందిన పలువురు నేతలు పాల్గొంటారన్నారు. ఓబీసీ ప్రధానిగా ఉన్న ఈ సమయంలోనే బీసీ హక్కులను సాధించుకోవాలన్నారు.

# దేశంలో తగ్గిన నిరుద్యోగ రేటు

న్యూఢిల్లీ: దేశంలో నిరుద్యోగ రేటు తగ్గింది. సోమవారం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన డేటా ప్రకారం, ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికానికి సంబంధించి నిరుద్యోగ రేటు 5.2 శాతానికి దిగొచ్చింది. అంతకుముందు జూన్ త్రైమాసికంలో ఇది 5.4 శాతంగా నమోదైంది. వ్యవసాయ సీజన్‌లో గ్రామీణ ఉపాధి గణనీయంగా పెరగడంతో పాటు మహిళల భాగస్వామ్యం పెరగడమే ఇందుకు కారణమని ప్రభుత్వ గణాంకాలు తెలిపాయి. 15 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసు ఉన్నవారిలో నిరుద్యోగం గ్రామీణ ప్రాంతంలో 4.8 శాతం నుంచి 4.4 శాతానికి తగ్గింది. పట్టణ ప్రాంతాల్లో ఇది 6.8 శాతం నుంచి 6.9 శాతానికి చేరింది. 15 ఏళ్ల కంటే ఎక్కువ వయసున్న ప్రజల్లో కార్మిక శక్తి భాగస్వామ్య రేటు (ఎల్ఎఫ్‌పీఆర్) 55. శాతం నుంచి 55.1 శాతానికి స్వల్పంగా పెరిగింది. మహిళా భాగస్వామ్య రేటు 33.4 శాతం నుంచి 33.7 శాతానికి చేరుకుంది. అయితే, పట్టణ ప్రాంతాల్లో మహిళల నిరుద్యోగిత రేటు గత త్రైమాసికంలో 8.9 శాతం ఉండగా, సెప్టెంబర్ త్రైమాసికంలో 9 శాతానికి పెరిగింది. పురుషుల్లో ఇది 6.1 శాతం నుంచి 6.2 శాతానికి పెరిగిందని గణాంకాలు పేర్కొన్నాయి.

# కేపీసీ సంస్థల్లో జీఎస్టీ అధికారుల సోదాలు

హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని పంజాగుట్ట, బేగంపేటలో ఉన్న కేపీసీ ప్రాజెక్టు సంస్థకు చెందిన కార్యాలయాల్లో సోమవారం మధ్యాహ్నం నుంచి జీఎస్టీ అధికారుల సోదాలు కొనసాగాయి. ఏడు బృందాలుగా విడిపోయి తనిఖీలు చేశారు. ఈ సంస్థ వ్యాపార లావాదేవీలు, జీఎస్టీ చెల్లింపులకు వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. దీంతో వాణిజ్య పన్నుల కమిషనర్ రఘునందన్‌రావు ఆదేశాలతో అధికారులు సోదాలు చేపట్టారు. అర్ధరాత్రి వరకు తనిఖీలు కొనసాగాయి.

# అందెశ్రీ మరణం పట్ల పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి

హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): ప్రముఖ తెలుగు సాహితీవేత్త, గేయ రచయిత అందెశ్రీ మరణం బాధాకరమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర గీతం "జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం" రచించి తెలంగాణ చరిత్రలో ఆయన చిరస్మరణీయంగా నిలిచారని కొనియాడారు. అందెశ్రీ మృతి పట్ల తీవ్ర సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అందెశ్రీ గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అందెశ్రీ హఠాన్మరణం దిగ్భ్రాంతి కలిగించిందని పవన్ కల్యాణ్ తెలిపారు. ఆయన రచనా ప్రస్థానం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకొంటుందని తెలిపారు. గొర్రెల కాపరిగా, భవన నిర్మాణ కూలీగా జీవితం మొదలుపెట్టి అక్షర యాత్ర చేశారని అన్నారు. తెలంగాణ జానపదాలపై, మాండలికంపై పట్టు కలిగిన రచయిత ఆయన అని కొనియాడారు. పలు సినీ గీతాలు రచించారని.. 'మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు%ొ%' గీతం వింటే సమాజాన్ని అందెశ్రీ ఎంతగా చదివారో అర్థమవుతుందని అన్నారు.

# 17 మంది విద్యార్థులకు అస్వస్థత

జమ్మికుంట, నవంబర్ 10 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా జమ్మికుంట ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్న 17 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. అప్రమత్తమైన ఉపాధ్యాయులు చికిత్స కోసం వారిని జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. మధ్యాహ్న భోజనంలో గుడ్లు వాసన వచ్చాయని, అన్నంలో పురుగులు ఉన్నాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేదని ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు

# మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్

హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): టీమిండియా మాజీ కెప్టెన్, తెలంగాణ మంత్రి అజారుద్దీన్ ఈరోజు తన శాఖల బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో కుటుంబ సభ్యుల సమక్షంలో, ముస్లిం మత పెద్దల ప్రార్థనల మధ్య ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కేటాయించిన మైనార్టీల సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖల మంత్రిగా అధికారికంగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ, తనపై ఎంతో నమ్మకం ఉంచి ఈ గురుతర బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్‌కు పలువురు అధికారులు, నేతలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. గత నెల 31వ తేదీన అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. రాజ్‌భవన్‌లో ఆయన చేత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. అనంతరం నవంబర్ 4వ తేదీన అజారుద్దీన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మైనార్టీ సంక్షేమ, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖలను అప్పగించారు. తాజాగా ఆయన ఈ శాఖల బాధ్యతలను అధికారికంగా స్వీకరించారు.

# స్పీకర్‌పై సుప్రీంలో ధిక్కార పిటిషన్

న్యూఢిల్లీ/హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాలు మరోసారి సుప్రీంకోర్టుకు చేరాయి. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడంలో జాప్యం చేస్తున్నారంటూ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టులో ధిక్కార పిటిషన్‌ను దాఖలు చేసింది. గతంలో అత్యున్నత న్యాయస్థానం నిర్దేశించిన మూడు నెలల గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని, ఇది కోర్టు ఆదేశాలను ధిక్కరించడమేనని పిటిషన్‌లో పేర్కొంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తరఫున ఈ పిటిషన్ దాఖలైంది. మరోవైపు, ఎమ్మెల్యేలపై విచారణకు సంబంధించి తమకు మరింత గడువు కావాలని కోరుతూ స్పీకర్ కార్యాలయం సైతం ఇప్పటికే సుప్రీంకోర్టులో అదనపు పిటిషన్ దాఖలు చేయడం గమనార్హం. ఈ క్రమంలో, తమ ధిక్కార పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది మోహిత్ రావు కోరారు. తమ కేసు విచారణకు రాకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన చీఫ్ జస్టిస్ గవాయ్... "నేను ఈ నెల 23న పదవీ విరమణ చేస్తున్నాను. ఆ తర్వాత నవంబర్ 24 నుంచి సుప్రీంకోర్టుకు సెలవులు" అని వ్యాఖ్యానించారు. వాదనలు విన్న అనంతరం, ఈ పిటిషన్‌పై విచారణను వచ్చే సోమవారం చేపడతామని ధర్మాసనం స్పష్టం చేసింది. దీంతో బీఆర్ఎస్ పిటిషన్‌తో పాటు స్పీకర్ కార్యాలయం వేసిన అదనపు పిటిషన్‌పై కూడా సోమవారం విచారణ జరగడం ఖాయమైంది.

# ఉల్లిపాయల లారీ బోల్తా

# బస్తాలను ఎత్తుకెళ్లిన వాహనదారులు

నార్కట్‌పల్లి, నవంబర్ 10 (ఈవార్తలు): నల్లగొండ జిల్లాలో ఉల్లిపాయల లారీ బోల్తా పడటంతో స్థానికులు, వాహనదారులు బస్తాలను తీసుకువెళ్లారు. జిల్లాలోని నార్కట్‌పల్లి సమీపంలోని ఏపీ లింగోటం వద్ద ఈ ప్రమాదం జరిగింది. యూటర్న్ తీసుకుంటున్న స్కూల్ బస్సును ఉల్లిపాయల లోడుతో వెళుతున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ధాటికి లారీ అదుపు తప్పి రోడ్డు పక్కకు బోల్తా పడింది. సమీప ప్రాంతాల నుంచి వాహనదారులు, స్థానికులు లారీలోని ఉల్లిపాయల బస్తాలను తీసుకువెళ్లడానికి ఎగబడ్డారు. ఈ విషయం తెలియడంతో పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఉల్లిపాయలు బస్తాలు తీసుకువెళుతున్న వారిని నిలువరించారు.



# భీమన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ, నవంబర్ 10 (ఈవార్తలు): వేములవాడలో సోమవారం ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు శ్రీరాజరాజేశ్వర స్వామివారిని, భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. భీమేశ్వరాలయంలో అభిషేకం, అన్న పూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభమైన కారణంగా రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానంలో భక్తులను సాధారణ దర్శనాలకు మాత్రమే అనుమతిస్తున్నారు. అన్ని రకాల ఆర్జిత సేవలను భీమేశ్వరాలయంలోనే కొనసాగిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేపట్టారు.

# బాధితులకు సత్వర న్యాయం జరగాలి

**గ్రీవెన్స్ డేలో జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్**

జగిత్యాల టౌన్, నవంబర్ 10 (ఈవార్తలు): ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా సోమవారం 14 మంది అర్జీదారులు జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్‌కు తమ సమస్యలు విన్నవించుకున్నారు. బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించాలని అన్నారు.






# విశాఖ కేంద్రంగా ఎకనామిక్ రీజియన్

**ఏపీ సీఎం చంద్రబాబు కీలక సమీక్ష**

**శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకు విస్తరణ**

అమరావతి, నవంబర్ 10 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌ను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అమరావతి-విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. సోమవారం సచివాలయంలో ఆయన ఈ అంశంపై ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. విశాఖపట్నాన్ని కేంద్రంగా చేసుకుని రాష్ట్రానికి ఒక ప్రధాన గ్రోత్ హబ్ ను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. ఈ సమీక్షలో భాగంగా శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకు ఉన్న జిల్లాలను కలుపుకొని 'సమగ్ర విశాఖ ఎకనామిక్ రీజియన్'ను ఎలా అభివృద్ధి చేయాలనే దానిపై ప్రధానంగా చర్చించారు. ఈ ప్రాంతంలోని సహజ వనరులు, మౌలిక సదుపాయాలను వినియోగించుకుంటూ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ఆర్థిక ప్రగతికి బాటలు వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ లక్ష్య సాధన కోసం ఒక పటిష్టమైన 'ఎకనామిక్ మాస్టర్ ప్లాన్' రూపొందించాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ ప్రణాళికలో ఆయా జిల్లాల ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పించడం, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం, పర్యావరణ పరిరక్షణతో కూడిన సుస్థిరాభివృద్ధి సాధించడం వంటి కీలక అంశాలు ఉండాలని ఆయన సూచించారు. ఈ కీలక సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్‌తో పాటు ఆర్థిక, పర్యాటక, పారిశ్రామిక, రవాణా, ఐటీ, మున్సిపల్, వ్యవసాయ, ప్రణాళికా విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వారు తమ విభాగాల పరంగా చేపట్టాల్సిన చర్యలపై ముఖ్యమంత్రికి వివరాలు అందించారు.

# 80 లక్షల టన్నులు లక్ష్యం

**పౌర సరఫరాల మంత్రి ఉత్తమ్.. పంట కొనుగోళ్లపై కలెక్టర్లతో వీసీ**

జగిత్యాల టౌన్, హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): రాష్ట్రం ధాన్యం కొనుగోళ్లలో కొత్త మైలురాయిని అధిగమించిందని, ఖరీఫ్ సీజన్‌లో 8.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గత సంవత్సరం ఇదే సమయంలో కొనుగోలు చేసిన 3.94 లక్షల మెట్రిక్ టన్నుల కంటే రెండింతలు ఎక్కువ సేకరణ చేసినట్లు వెల్లడించారు. సోమవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు , పౌర సరఫరాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వాతావరణ ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం కొనుగోళ్లపై తప్పుడు ప్రచారాన్ని అరికట్టాలని ఆదేశించారు. రాష్ట్రం ధాన్యం ఉత్పత్తి, కొనుగోళ్లలో చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో రికార్డు నెలకొల్పిందని తెలిపారు. దేశంలో తొలిసారిగా ఒక రాష్ట్ర ప్రభుత్వం ఒకే ఖరీఫ్ సీజన్‌లో 80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించుకుందన్నారు. ఇది తెలంగాణ వ్యవసాయ రంగ బలాన్ని, రైతుల పట్ల మా ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. ఇప్పటి వరకు 3.95 లక్షల మెట్రిక్ టన్నుల సన్నాలు, 4.59 లక్షల మెట్రిక్ టన్నుల పెద్ద ధాన్యం కొనుగోలు చేసినట్లు, కేంద్రాలకు ధాన్యం అమ్మిన రైతుల సంఖ్య గత సంవత్సరం 55,493 మందిగా ఉండగా, ఈ ఏడాది 1,21,960 మందికి చేరిందని చెప్పారు. మొత్తం ధాన్యం కొనుగోలు విలువ రూ. 2,041.44 కోట్లు కాగా, ఇది గత సంవత్సరం రూ. 915.05 కోట్లతో పోలిస్తే రెట్టింపు ఉందన్నారు. ఇందులో రూ. 832.90 కోట్లు ఇప్పటికే రైతులకు చెల్లించగా, మిగిలిన రూ. 1,208.54 కోట్లు ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఓపీఎంఎస్) ద్వారా నమోదు తర్వాత 48 గంటల్లో చెల్లించనున్నట్లు తెలిపారు. సన్నాల బోనస్ గత సంవత్సరం రూ. 43.02 కోట్ల నుండి ఈ సంవత్సరం రూ. 197.73 కోట్లకు పెరిగిందని, అందులో రూ. 35.72 కోట్లు ఇప్పటి వరకు చెల్లించామన్నారు. రైతులకు సమయానికి చెల్లింపులు చేయడమే కాకుండా, తగిన నిల్వలు, రవాణా సదుపాయాలు కల్పించి, కలెక్టర్లు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. మొంథో తుఫాన్ నుండి రైతులు కొంతవరకు కోలుకుంటున్న సమయంలోనే మరో వాతావరణ వ్యవస్థ ఏర్పడిందని పేర్కొన్నారు. అన్ని జిల్లాలు ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, నిల్వ ధాన్యాన్ని త్వరగా రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ధాన్యం తడవకుండా రక్షించేందుకు ప్రతి కొనుగోలు కేంద్రంలో తార్పాలిన్ షీట్లు అందుబాటులో ఉంచాలని, రైతులకు ప్రతిరోజు వాతావరణ హెచ్చరికలు అందజేయాలని చెప్పారు. వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని తక్షణమే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించి, బాయిల్డ్ రైస్ కోటా కేటాయింపుల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అదనంగా తగిన గోదాంలు, స్థానిక హమాలీ సిబ్బందిని సమకూర్చి కొనుగోలు ప్రక్రియ అంతరాయం లేకుండా కొనసాగించాలని ఆదేశించారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తుఫాన్ కారణంగా సుమారు 1.10 లక్షల ఎకరాలలో ధాన్యం, మొక్కజొన్న, పత్తి పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ రూపొందించిన పంటనష్టం నివేదికను కేంద్రానికి పంపామని, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కొనుగోళ్లు సజావుగా సాగేందుకు ధాన్య తేమ శాతం నిబంధనలను సడలించమని కేంద్రాన్ని అభ్యర్థించామని చెప్పారు.తాము కేంద్రంతో చర్చలు కొనసాగిస్తామన్నారు. వాతావరణ ప్రభావంతో నష్టపోయిన పంటలు రైతులకు నష్టం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.



# జగన్ నన్ను 'అధ్యక్షా' అనలేకే రావట్లేదు

**స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆరోపణలు**

అమరావతి, నవంబర్ 10 (ఈవార్తలు): వైసీపీ అధినేత జగన్ ఇప్పుడు కేవలం ఒక ఎమ్మెల్యే మాత్రమేనని, అసెంబ్లీలో స్పీకర్‌గా ఉన్న తనను 'అధ్యక్షా' అని సంబోధించడం ఇష్టం లేకపోవడం వల్లే సభకు హాజరు కావడం లేదని ఏపీ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. బయట మీడియాతో మాట్లాడటం కాదని, దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడాలని జగన్‌కు సవాల్ విసిరారు. సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం పెడపర్తిలో రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగిన యాగంలో పాల్గొన్న అనంతరం అయ్యన్నపాత్రుడు మీడియాతో మాట్లాడారు. "సాధారణ ఎమ్మెల్యేకు సభలో ఎంత సమయం ఇస్తామో, జగన్‌కు కూడా అంతే ఇస్తాం. ఆయన వచ్చి మాట్లాడాలి. కానీ స్పీకర్ స్థానంలో ఉన్న నా ముందు నిలబడి మాట్లాడే ఇష్టం లేకే ఆయన సభకు రావట్లేదు" అని అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. జగన్‌తో పాటు మిగిలిన 10 మంది వైసీపీ ఎమ్మెల్యేలు కూడా జీతాలు తీసుకుంటున్నప్పటికీ సభకు హాజరుకాకపోవడం దారుణమని విమర్శించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనపై అయ్యన్నపాత్రుడు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పూర్వకాలంలో రాక్షసుల నుంచి రాజ్యాన్ని కాపాడుకోవడానికి యాగాలు చేసేవారని, అలాంటి రాక్షస పాలనను గత ఐదేళ్లలో ఏపీ ప్రజలు చూశారని అన్నారు. జగన్‌కు అధికారం తెలుసు కానీ, పరిపాలన చేతకాలేదని విమర్శించారు. ఆయన మూర[illegible]పు పాలనతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి, ఖజానాను కొల్లగొట్టారని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజలు ఆ రాక్షస పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకే కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని అయ్యన్నపాత్రుడు తెలిపారు. అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే వైసీపీ నేతలు పనిగట్టుకుని వక్రీకరిస్తున్నారని ఆయన మండిపడ్డారు.



# పెట్రోల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్య

**తంగళ్ళపల్లి మండలంలో కలకలం**

తంగళ్ళపల్లి, నవంబర్ 10 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలో పెట్రోల్ పోసుకుని ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన తీవ్ర కలకలం రేపింది. మండల కేంద్రానికి చెందిన మచ్చ జలంధర్ అనే వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడు మచ్చ జలంధర్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

# నేడు సర్దార్ యూనిటీ మార్చ్

జగిత్యాల టౌన్, నవంబర్ 10 (ఈవార్తలు): దేశ నిర్మాణం దిశగా యువతలో స్ఫూర్తిని నింపనున్న సర్దార్ 150 యూనిటీ మార్చ్ మంగళవారం జరగనుంది. ఉదయం 9:30 నిమిషాలకు స్వామి వివేకానంద మినీ స్టేడియం నుంచి ప్రారంభమై న్యూ బస్ స్టేషన్ సర్కిల్ వరకు వెళ్లి, తిరిగి మినీ స్టేడియంకు చేరుకుంటుందని జగిత్యాల జిల్లా యువభారత్ డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ వెంకట్ రాంబాబు తెలిపారు. ఈ మార్చ్‌లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# వెరీ గుడ్.. బాగా పనిచేశారు!

**మంత్రులను ప్రశంసించిన చంద్రబాబు**

అమరావతి, నవంబర్ 10 (ఈవార్తలు): ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో మొంథా తుపాను సహాయక చర్యలపై కీలక చర్చ జరిగింది. ఈ సందర్భంగా తుపాను సమయంలో క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేసి, ప్రజలకు అండగా నిలిచిన మంత్రులను, అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. అందరి సమష్టి కృషితోనే పెను నష్టాన్ని నివారించగలిగామని ఆయన ప్రశంసించారు. మొంథా తుపాను సమయంలో ప్రతి మంత్రి తమకు కేటాయించిన ప్రాంతాల్లోనే ఉండి, సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించడం వల్ల ప్రజలకు వేగంగా సేవలు అందాయని సీఎం పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మొత్తం అధికార యంత్రాంగం పూర్తి సమన్వయంతో పనిచేయడం వల్లే సహాయక కార్యక్రమాలు అత్యంత వేగంగా జరిగాయని తెలిపారు. ఈ సమష్టి కృషే మంచి ఫలితాలను ఇచ్చిందని ఆయన అభిప్రాయపడ్డారు. అదే సమయంలో టెక్నాలజీ వినియోగంపై కూడా చంద్రబాబు మాట్లాడారు. ఆర్టీజీ (రియల్-టైమ్ గవర్నెన్స్) సెంటర్ ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగామని వివరించారు. మంత్రులు, అధికారులు ఒక బృందంగా (టీం స్పిరిట్‌తో) పనిచేయడం తాను ప్రత్యక్షంగా గమనించానని, వారి కష్టానికి అభినందనలు అని చంద్రబాబు పేర్కొన్నారు.

# జోగి రమేశ్‌కు బిగుస్తున్న ఉచ్చు

విజయవాడ. నవంబర్ 10 (ఈవార్తలు): నకిలీ మద్యం కేసులో అరెస్టయి జైల్లో ఉన్న మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్‌కు న్యాయపరమైన చిక్కులు మరింత పెరిగేలా కనిపిస్తున్నాయి. ఇప్పటికే కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఆయనపై మరిన్ని కేసులు నమోదు చేసేందుకు సీఐడీ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. సంచలనం సృష్టించిన అగ్రిగోల్డ్ భూముల అమ్మకాల్లో జరిగిన అవకతవకలతో జోగి రమేశ్‌కు సంబంధం ఉన్నట్లు సీఐడీ గుర్తించినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే, ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలో వెలుగు చూసిన నకిలీ మద్యం కేసులో జోగి రమేశ్ ప్రస్తుతం నెల్లూరు జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ కేసులో బెయిల్ కోసం ఆయన ప్రయత్నిస్తున్నప్పటికీ, కోర్టు రిమాండ్ గడువును పొడిగిస్తుండటంతో ఆయనకు నిరాశే ఎదురవుతోంది. ఈ ఇబ్బందులు చాలవన్నట్లు, ఇప్పుడు భూముల వ్యవహారాలు కూడా ఆయన్ను చుట్టుముడుతున్నాయి. అగ్రిగోల్డ్ ఆస్తుల అమ్మకాల్లో అక్రమాలు జరిగాయని, దీనిలో జోగి రమేశ్ పాత్ర ఉందని సీఐడీ అధికారులు భావిస్తున్నారు. దీంతో పాటు, పెడనలో జరిగిన భూముల కొనుగోళ్లు, అమ్మకాలకు సంబంధించి కూడా ఆయనపై సీఐడీకి ఫిర్యాదులు అందినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ రెండు వ్యవహారాలపై కూడా కొత్తగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేసేందుకు సీఐడీ అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవైపు నకిలీ మద్యం కేసు, మరోవైపు భూముల అవకతవకల ఆరోపణలతో జోగి రమేశ్‌కు కష్టాలు రెట్టింపయ్యాయి. అయితే, ఈ కేసులన్నీ రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని వైసీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. తమ నేతలను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తూ వేధింపులకు గురిచేస్తోందని వారు మండిపడుతున్నారు.

# మూడున్నర గంటలు.. 70 అంశాలు

**పవన్ కల్యాణ్‌పై చంద్రబాబు ప్రశంసలు**

అమరావతి, నవంబర్ 10 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు, సహచర మంత్రులు ప్రశంసలు కురిపించారు. పవన్ పనితీరు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని అభినందించారు. సోమవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన అమరావతిలో జరిగిన క్యాబినెట్ భేటీలో ఈ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల మామండూరు అటవీ ప్రాంతంతో పాటు మంగళంలోని ఎర్రచందనం డిపోను సందర్శించిన వివరాలను పవన్ కల్యాణ్ నేటి మంత్రివర్గ సమావేశంలో పంచుకున్నారు. వైసీపీ నేత పెద్దిరెడ్డి ఆక్రమణలపై ఆధారాలతో వీడియోలు తీయించానని తెలిపారు. సందర్భంగా ఆయన చొరవను, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న తీరును సీఎం ప్రత్యేకంగా అభినందించారు. పట్టుబడిన ఎర్రచందనం దుంగలతో ఏవైనా పరికరాలు చేద్దామని చంద్రబాబు ప్రతిపాదించారు. సోమవారం సుమారు మూడున్నర గంటల పాటు సాగిన ఈ సమావేశంలో దాదాపు 70 అజెండా అంశాలపై కూలంకషంగా చర్చించారు. పలు కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. రాజధాని అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అదేవిధంగా, వివిధ సంస్థలకు భూముల కేటాయింపుపై సీఆర్‌డీఏ తీసుకున్న నిర్ణయాలను కూడా మంత్రివర్గం సమర్థించింది. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు భూ కేటాయింపుల్లో ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని నిర్ణయించింది. రెవెన్యూ శాఖలో దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు పచ్చజెండా ఊపింది. సమావేశం అనంతరం మంత్రులతో మాట్లాడిన సీఎం చంద్రబాబు, ఇటీవల సంభవించిన మొంథా తుపాను సమయంలో యంత్రాంగం అద్భుతంగా పనిచేసిందని కొనియాడారు. మంత్రులు, అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి ప్రజలకు అండగా నిలవడం వల్లే నష్టాన్ని తగ్గించగలిగామని తెలిపారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సిస్టమ్ (ఆర్టీజీఎస్) ద్వారా నిరంతరం పర్యవేక్షించడం సత్ఫలితాలనిచ్చిందని అన్నారు. సమన్వయంతో పనిచేస్తేనే ఉత్తమ ఫలితాలు వస్తాయని, ఆ స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా పేదలందరికీ ఇళ్లు అందించే బాధ్యతను మంత్రులు, ఎమ్మెల్యేలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నివాస స్థలం లేని వారి జాబితాలను సిద్ధం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని నివారించాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు.

# కేఏ పాల్ పై సుప్రీంకోర్టు ఆగ్రహం

అమరావతి, నవంబర్ 10 (ఈవార్తలు): ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన ఒక పిటిషన్‌పై విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేవలం ప్రచారం కోసమే ఇలాంటి పిటిషన్లు వేస్తున్నారంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తున్నారంటూ కేఏ పాల్ నేరుగా సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ పిటిషన్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. పిటిషన్‌ను పరిశీలించిన ధర్మాసనం, కేఏ పాల్ తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. "ఇలాంటి విషయాలపై ముందుగా సంబంధిత హైకోర్టును ఆశ్రయించాలి. అది చేయకుండా నేరుగా సుప్రీంకోర్టుకు రావడం ఏమిటి? కేవలం పబ్లిసిటీ కోసమే మీరు ఇలాంటి పిటిషన్లు వేస్తున్నారు" అంటూ ధర్మాసనం పాల్‌పై మండిపడింది. ఈ తరహా పిటిషన్లతో న్యాయవ్యవస్థ విలువైన సమయం వృథా అవుతోందని అభిప్రాయపడింది. చట్టపరమైన మార్గాలను అనుసరించకుండా అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడం జరపడానికి నిరాకరించిన సుప్రీంకోర్టు, ముందుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు వెళ్లాలని కేఏ పాల్‌కు సూచించింది.

# పిన్నెల్లి సోదరులకు సుప్రీంకోర్టులో నిరాశ



పల్నాడు, నవంబర్ 10 (ఈవార్తలు): పల్నాడు జిల్లా గుండ్లపాడు జంట హత్యల కేసులో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డికి సుప్రీంకోర్టులో మరోసారి నిరాశ ఎదురైంది. ఈ కేసులో వారు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను సర్వోన్నత న్యాయస్థానం రెండు వారాలకు వాయిదా వేసింది. ఈరోజు ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం, ఇరుపక్షాల వాదనలను విన్నది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాల తర్వాత జరుపుతామని స్పష్టం చేసింది. కాగా, నేటి విచారణలో తమకు కచ్చితంగా బెయిల్ లభిస్తుందని ఆశించిన పిన్నెల్లి సోదరులకు ఈ పరిణామం నిరాశ కలిగించింది. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావు హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి మే 25న పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో పోలీసులు మొత్తం ఏడుగురిని నిందితులుగా చేర్చారు. జవిశెట్టి శ్రీను (ఏ1), తోట వెంకట్రావు (ఏ2), తోట గురవయ్య (ఏ3), నాగరాజు (ఏ4), తోట వెంకటేశ్వర్లు (ఏ5)లతో పాటు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని (ఏ6), పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిని (ఏ7) పేర్కొన్నారు. అందరిపైనా ఐపీసీ సెక్షన్ 302 (హత్య) కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు పిన్నెల్లి సోదరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# ఎట్టకేలకు షట్‌డౌన్ డౌన్!




**ముగింపు దిశగా అమెరికా షట్‌డౌన్**

**సెనేట్‌లో కీలక పరిణామం**

**ప్రభుత్వ కార్యకలాపాలు**

**పునరుద్ధరించే బిల్లుకు ఆమోదం**

**హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ ఆమోదమే తరువాయి**

వాషింగ్టన్: అమెరికా చరిత్రలోనే అత్యంత సుదీర్ఘంగా, 40 రోజులుగా కొనసాగుతున్న ప్రభుత్వ షట్‌డౌన్‌కు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యకలాపాలను పునరుద్ధరించేందుకు ఉద్దేశించిన కీలక బిల్లుకు అమెరికా సెనేట్ ఆమోదముద్ర వేసింది. ఇరుపక్షాల మధ్య కుదిరిన ఈ ఒప్పందాన్ని ఇప్పుడు తుది ఆమోదం కోసం హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌కు పంపనున్నారు. డెమొక్రాటిక్ సెనేటర్లు జీన్ షాహీన్, మ్యాగీ హసన్.. రిపబ్లికన్ లీడర్ జాన్ థూన్, వైట్‌హౌస్ ప్రతినిధులతో కలిసి వారాంతంలో జరిపిన చర్చలు ఫలించాయి. ఈ బిల్లు ప్రకారం చాలా ఫెడరల్ ఏజెన్సీలకు జనవరి వరకు నిధులు అందుతాయి. షట్‌డౌన్ కారణంగా ప్రభావితమైన ఫెడరల్ ఉద్యోగులందరికీ బకాయిపడ్డ జీతాలను చెల్లించేందుకు హామీ ఇచ్చారు. ఆసక్తికరంగా సెనేట్‌లోని డెమొక్రాటిక్ పార్టీ నేత చక్ షుమర్ ఈ బిల్లును వ్యతిరేకించారు. ఆరోగ్య సంరక్షణ చట్టం కింద సబ్సిడీల వంటి సమస్యలను పరిష్కరించలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ 8 మంది డెమొక్రాటిక్ సెనేటర్లు పార్టీ వైఖరిని పక్కనపెట్టి బిల్లుకు మద్దతు పలకడంతో 60 ఓట్ల మెజారిటీతో ఇది ఆమోదం పొందింది. ఈ చట్టం ద్వారా షట్‌డౌన్ సమయంలో అధ్యక్షుడు ట్రంప్ తొలగించిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకుంటారు. అలాగే 2026 ఆర్థిక సంవత్సరం వరకు ఫుడ్ స్టాంప్ కార్యక్రమానికి నిధుల కొరత లేకుండా చూస్తారు. ఇది ప్రభుత్వ సహాయంపై ఆధారపడిన తక్కువ ఆదాయ కుటుంబాలకు పెద్ద ఊరట.

# జడ్జీలపై ఆరోపణలు ట్రెండైంది!

**ఇలాంటివి సహించం: సీజేఐ**

**అనుకూలంగా తీర్పు రాకపోతే**

**నిందించడం సరికాదన్న సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ: తమకు అనుకూలంగా తీర్పులు రానప్పుడు న్యాయమూర్తులపై తీవ్రమైన, నిరాధార ఆరోపణలు చేసే ధోరణి పెరిగిపోవడంపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి పద్ధతులను తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఎన్. పెద్ది రాజు అనే వ్యక్తిపై నమోదైన కోర్టు ధిక్కరణ కేసు విచారణ సందర్భంగా సీజేఐ సోమవారం ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌషుమి భట్టాచార్యపై పెద్ది రాజు తీవ్రమైన ఆరోపణలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేసింది. అయితే, పిటిషనర్ పెద్ది రాజు చెప్పిన క్షమాపణను సదరు న్యాయమూర్తి అంగీకరించారని సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే కోర్టుకు తెలిపారు. దీంతో ధర్మాసనం ఈ కేసును మూసివేసింది. అయినప్పటికీ, ఈ ధోరణిపై సీజేఐ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "న్యాయస్థానానికి సేవకులుగా ఉండే న్యాయవాదులకు కోర్టు పట్ల ఒక బాధ్యత ఉంటుంది. శిక్షించడంలో కాదు, క్షమాపణ చెప్పినప్పుడు క్షమించడంలోనే చట్టం యొక్క గొప్పతనం ఉంటుంది. ఆరోపణలు ఎదుర్కొన్న హైకోర్టు న్యాయమూర్తే క్షమాపణను అంగీకరించారు కాబట్టి మేము ఈ కేసును ముందుకు తీసుకెళ్లడం లేదు. అయితే, న్యాయమూర్తులపై ఆరోపణలు చేసే పిటిషన్లపై సంతకాలు చేసే ముందు న్యాయవాదులు చాలా జాగ్రత్తగా ఉండాలి" అని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఎస్సీ/ఎస్టీ చట్టం కేసులో హైకోర్టు ఉపశమనం కల్పించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ పెద్ది రాజు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన బదిలీ పిటిషన్‌లో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి పక్షపాతంతో వ్యవహరించారని, అనుచితంగా ప్రవర్తించారని తీవ్ర ఆరోపణలు చేశారు.

# పసిడి మళ్లీ పరుగులు

**భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు**

**ఎంసీఎక్స్‌లో రూ.1.22 లక్షలు దాటిన 10 గ్రాముల బంగారం**

**కిలో వెండి ధర రూ.1.50 లక్షల పైకి చేరిక**

**అమెరికాలో వడ్డీ రేట్ల కోత అంచనాలతో పెరుగుదల**



ముంబై: బంగారం, వెండి ధరలు ఇవాళ భారీగా పెరిగాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, వచ్చే నెలలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చన్న అంచనాలు బులియన్ మార్కెట్‌కు కొత్త ఊపునిచ్చాయి. దేశీయ మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ లో ఉదయం 10 గంటల సమయంలో బంగారం ధర 1.16 శాతం పెరిగి 10 గ్రాములకు రూ. 1,22,468కి చేరింది. అదేవిధంగా వెండి ధర 1.99 శాతం వృద్ధితో కిలోకు రూ. 1,50,666 వద్ద ట్రేడ్ అయింది. అక్టోబర్‌లో రికార్డు స్థాయికి చేరిన తర్వాత కొంత తగ్గుముఖం పట్టిన పసిడి ధరలు, మళ్లీ పుంజుకున్నాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థ పనితీరుపై పెరుగుతున్న ఆందోళనలు, వచ్చే నెలలో వడ్డీ రేట్ల కోత ఉండొచ్చన్న అంచనాలు పసిడికి డిమాండ్ పెంచుతున్నాయి. మెహతా ఈక్విటీస్‌కు చెందిన కమొడిటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలాంత్రీ ప్రకారం గత వారం మొత్తం ధరలలో తీవ్ర ఒడుదొడుకులు కనిపించినా, అమెరికాలో వినియోగదారుల సెంటిమెంట్ బలహీనపడటం, ప్రభుత్వ షట్‌డౌన్‌పై నెలకొన్న అనిశ్చితి కారణంగా ధరలు తిరిగి కోలుకున్నాయి. అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ రికార్డు స్థాయికి చేరడం ఆర్థిక వ్యవస్థపై ఆందోళనలను మరింత పెంచిందని, దీంతో సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు పెట్టుబడిదారులు మళ్లుతున్నారని ఆయన వివరించారు. మరోవైపు డాలర్ ఇండెక్స్ బలహీనపడటం కూడా బంగారం, వెండి ధరల పెరుగుదలకు కారణమైంది. ఇదిలాఉంటే.. ముడి చమురు ధరలు కూడా ఈరోజు పుంజుకున్నాయి. బ్యారెల్ డబ్ల్యూటీఐ క్రూడ్ ధర 60 డాలర్ల మార్కును దాటింది. ఒపెక్, ఐఈఏ నుంచి వెలువడనున్న నివేదికల కోసం ట్రేడర్లు ఎదురుచూస్తున్నారు. అయితే, ఒపెక్ దేశాలు ఉత్పత్తి పరిమితులను సడలించడం, అమెరికా ఉత్పత్తిని పెంచడం వంటి కారణాలతో సరఫరా మిగులుపై అంచనాలు మార్కెట్‌ను మిశ్రమంగా ఉంచుతున్నాయి.

# ఫిలిప్పీన్స్‌లో ఎమర్జెన్సీ

**'ఫుంగ్-వాంగ్' తుపానుతో అతలాకుతలం**

**వందల విమానాల రద్దు, విద్యుత్ నిలిపివేత**

న్యూఢిల్లీ: ఫిలిప్పీన్స్‌ను మరో పెను తుపాను అతలాకుతలం చేస్తోంది. ఇటీవలే 'కల్మేగి' తుపాను సృష్టించిన విధ్వంసం నుంచి కోలుకోకముందే, 'ఫుంగ్-వాంగ్' (ఉవాన్) అనే సూపర్ టైఫూన్ దేశంపై విరుచుకుపడింది. సోమవారం ఉదయం అరోరా ప్రావిన్స్‌లోని దినాలుంగన్ పట్టణం వద్ద ఇది తీరం దాటింది. ఆ సమయంలో గంటకు 185 కిలోమీటర్ల స్థిరమైన వేగంతో గాలులు వీచాయని, వాటి తీవ్రత గరిష్ఠంగా గంటకు 230 కిలోమీటర్ల వరకు చేరిందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇటీవలి కాలంలో ఫిలిప్పీన్స్‌ను తాకిన అత్యంత శక్తిమంతమైన తుపాను ఇదేనని నిపుణులు చెబుతున్నారు. ఫుంగ్-వాంగ్ దాదాపు 1800 కిలోమీటర్ల వెడల్పున విస్తరించి ఉండటంతో దేశంలోని మూడింట రెండొంతుల భూభాగాన్ని ప్రభావితం చేయవచ్చని అంచనా వేస్తున్నారు. కాగా, అక్టోబర్ 7న సంభవించిన 'కల్మేగి' తుపాను కారణంగా ఇప్పటికే 224 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మరో భారీ విపత్తు ముంచుకురావడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఫుంగ్-వాంగ్ ప్రభావంతో ఇప్పటికే ఇద్దరు మరణించారు. కాటాండువాన్స్ ప్రావిన్స్‌లో ఆకస్మిక వరదల్లో చిక్కుకుని ఒకరు మరణించగా, సమర్ ప్రావిన్స్‌లో ఓ మహిళపై శిథిలాలు పడటంతో ఆమె ప్రాణాలు కోల్పోయారు. ఈ విపత్కర పరిస్థితుల నేపథ్యంలో ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ దేశంలో ఎమర్జెన్సీని ప్రకటించారు. గంటకు 185 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో గాలులు వీచే తుపానులను ఇక్కడ 'సూపర్ టైఫూన్'గా వర్గీకరిస్తారు. పరిస్థితి తీవ్రతను తెలియజేయడానికే ఈ పదాన్ని ఉపయోగిస్తారు. "వర్షం, గాలుల తీవ్రతకు దాదాపు ఏమీ కనిపించని పరిస్థితి (జీరో విజిబిలిటీ) నెలకొంది" అని కాటాండువాన్స్ విపత్తు నిర్వహణ అధికారి రాబర్టో మాంటెరోలా ఏపీ వార్తా సంస్థకు తెలిపారు. వరద నీటిలో చిక్కుకున్న 14 మందిని తమ సిబ్బంది రక్షించారని ఆయన వెల్లడించారు. ప్రభుత్వం ముందుగానే హెచ్చరికలు జారీ చేయడంతో ఈశాన్య ప్రావిన్స్‌లలోని ప్రమాదకర ప్రాంతాల నుంచి 10 లక్షల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సుమారు 3 కోట్ల మంది ప్రజలపై ఈ తుపాను ప్రభావం పడవచ్చని అంచనా వేస్తున్నారు. రక్షణ మంత్రి గిల్బర్టో టియోడోరో జూనియర్ ప్రజలను అప్రమత్తం చేస్తూ, ప్రభుత్వ ఆదేశాలు పాటించి వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాలను విడిచి వెళ్లాలని సూచించారు. ముందుజాగ్రత్త చర్యగా ప్రభావిత ప్రాంతాల్లోని పలు నగరాలు, పట్టణాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు ప్రకటించారు. వారాంతం నుంచి ఇప్పటివరకు 325 దేశీయ, 61 అంతర్జాతీయ విమానాలను రద్దు చేశారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో ఓడరేవుల్లో రాకపోకలను నిలిపివేయగా, 6,600 మంది ప్రయాణికులు, కార్గో సిబ్బంది చిక్కుకుపోయారు.

# భారతీయుడికి 21 నెలల జైలు శిక్ష

**విమానంలో బాలికపై లైంగిక దాడి.. కీలక తీర్పు వెలువరించిన యూకే కోర్టు**



లండన్: విమానంలో ప్రయాణిస్తున్న 12 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ఓ భారతీయుడికి యూకే కోర్టు 21 నెలల జైలు శిక్ష విధించింది. ముంబైకి చెందిన షిప్పింగ్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ జావేద్ ఇనామ్‌దార్ (34) ఈ దారుణానికి ఒడిగట్టాడు. 2024 డిసెంబర్ 14న ముంబై నుంచి లండన్ వెళ్తున్న బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. 'ది సన్' పత్రిక కథనం ప్రకారం నిందితుడు జావేద్‌కు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. విమానంలో తన పక్క సీట్లో నిద్రిస్తున్న బాలిక పట్ల అతను అసభ్యంగా ప్రవర్తించాడు. మొదట ఆమె చేతిని నిమిరి, ఆ తర్వాత ఆమె దుస్తుల్లో చేయి పెట్టాడు. దీంతో ఉలిక్కిపడి నిద్రలేచిన ఆ బాలిక "నా దగ్గరి నుంచి వెళ్ళిపో" అంటూ గట్టిగా అరుస్తూ ఏడ్చేసింది. వెంటనే స్పందించిన విమాన సిబ్బంది, బాలికను విచారించగా జరిగిన విషయం చెప్పింది. క్యాబిన్ మేనేజర్ రెబెక్కా రూనీ కోర్టుకు తెలిపిన వివరాల ప్రకారం ఆ బాలిక తీవ్ర భయాందోళనతో కనిపించింది. మోకాళ్లను చాతీకి అదుముకుని తనను తాను రక్షించుకునే ప్రయత్నం చేస్తోందని ఆమె వివరించారు. నిందితుడిని ప్రశ్నించగా, తన భార్య అనుకుని పొరపాటున తాకినట్లు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. ఐల్స్‌వర్త్ క్రౌన్ కోర్టులో జరిగిన విచారణలో నిందితుడు హిందీ అనువాదకుడి సహాయం తీసుకున్నాడు. విచారణ జరుగుతున్నంత సేపు ఏడుస్తూనే ఉన్నాడు. అతని తరఫు న్యాయవాది వాదిస్తూ.. "అతను భారతదేశంలోని భిన్నమైన సంస్కృతి నుంచి వచ్చాడు. బెయిల్‌పై ఇక్కడే ఉండటం వల్ల తన భార్యాపిల్లలను కలుసుకోలేకపోయాడు. అతడి శిక్షను నిలిపివేస్తే వెంటనే దేశం విడిచి వెళ్లిపోతాడు" అని కోర్టుకు విన్నవించారు. అయితే, ఈ వాదనలను జడ్జి సైమన్ డేవిస్ తీవ్రంగా ఖండించారు. "భార్య అనుకున్నాననే వాదన నమ్మశక్యంగా లేదు. ఇది దారుణమైన చర్య. ఇలాంటి వారి నుంచి ఈ దేశం చిన్నారులను కచ్చితంగా కాపాడుతుంది. బాధితురాలు భయంతో కేకలు వేయగానే తప్పించుకోవడానికి కథలు అల్లావు" అని వ్యాఖ్యానించారు. నిందితుడు చాలాకాలంగా తన కుటుంబానికి దూరంగా యూకేలో ఉండటాన్ని మానవతా దృక్పథంతో పరిగణనలోకి తీసుకుని శిక్షను కొంత తగ్గించినట్లు తెలిపారు. విచారణ అనంతరం ఇనామ్‌దార్‌ను దోషిగా నిర్ధారించిన కోర్టు, అతనికి 21 నెలల కఠిన కారాగార శిక్షను ఖరారు చేసింది.

# వరుస రోడ్డు ప్రమాదాలపై సుప్రీం ఆందోళన

**నివేదిక సమర్పించాలని ఎన్‌హెచ్ఏఐ, తెలంగాణ, రాజస్థాన్‌కు ఆదేశం**

న్యూఢిల్లీ: జాతీయ రహదారులపై వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ప్రమాద ఘటనలపై నివేదిక సమర్పించాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)ను, తెలంగాణ, రాజస్థాన్ ప్రభుత్వాలను ఆదేశించింది. గత వారం ఉభయ తెలుగు రాష్ట్రాలలో రెండు భారీ బస్సు ప్రమాదాలు జరిగి 40 మంది మృతి చెందిన విషయం విదితమే. వరుస రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో సుప్రీంకోర్టు సుమోటో విచారణ చేపట్టింది. రాజస్థాన్‌లోని ఫలోడీ వద్ద జరిగిన ప్రమాదంపై జస్టిస్ జే.కె. మహేశ్వరి, విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఫలోడీతో పాటు తెలంగాణ-బీజాపూర్ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదాలపై రెండు వారాల్లోగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించింది. రోడ్డు నిర్వహణ సరిగా లేకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణమని సుప్రీంకోర్టు పేర్కొంది. జాతీయ రహదారుల మీద అనుమతి లేని దాబాలు కూడా ప్రమాదానికి కారణమని తెలిపింది. రహదారులపై అనుమతి లేకుండా ఎన్ని దాబాలు ఉన్నాయో సర్వే చేయాలని, రహదారుల పరిస్థితి ఎలా ఉందో నివేదిక ఇవ్వాలని తెలిపింది. రహదారులు సరిగ్గా లేకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణమని మీడియాలో వచ్చిన కథనాలు స్పష్టం చేస్తున్నాయని, తక్షణ చర్యలు అవసరమని సుప్రీంకోర్టు పేర్కొంది. నిర్వహణ సమయంలో కాంట్రాక్టర్లు తగిన ప్రమాణాలు పాటించారో లేదో వెల్లడించాలని ధర్మాసనం ఆదేశించింది.

# నేపాల్, బంగ్లాలో పాక్ 'ఉగ్ర' విస్తరణ

**సరిహద్దుల్లో ఉగ్రస్థావరాల ఏర్పాటుకు సన్నాహాలు**

న్యూఢిల్లీ: భారత్ చుట్టూ ఉగ్రవాదాన్ని విస్తరించేందుకు పాకిస్థాన్ కుట్రలు పన్నుతుందని భారత నిఘా వర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం భారత సరిహద్దు దేశాలైన నేపాల్, బంగ్లాదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఉగ్ర నివాసాలు, శిక్షణ కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. బంగ్లాదేశ్, నేపాల్ సరిహద్దులకు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉగ్ర స్థావరాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు భారత ఇంటెలిజెన్స్‌ను ఉటంకిస్తూ ఆంగ్ల మాధ్యమ వార్తా సంస్థలు పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఈ కార్యకలాపాలు మరింత వేగవంతమైనట్లు తెలుస్తోంది. ఉగ్రవాద శిక్షణ పొందే వారి కోసం బంగ్లాదేశ్, నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో కొత్త శిక్షణ శిబిరాలు, నివాస సముదాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. సరిహద్దులోని రాష్ట్రాల్లో ఇటీవల ఉగ్రవాద సంస్థలకు చెందిన వారిని అరెస్టు చేయగా, వారి విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను పెంచినట్లు నిఘా వర్గాలు తెలిపాయి. పొరుగు దేశాల్లో విదేశీ నిధులతో ఏర్పాటవుతున్న పలు ప్రాజెక్టులపై కూడా నిఘా ఉంచినట్లు పేర్కొన్నాయి. లష్కరే తోయిబా, జైష్ ఏ మహమ్మద్ వంటి ఉగ్రవాద సంస్థలు నేపాల్‌లో తమ సంస్థలను విస్తరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఆల్-ఖైదా, ఐసిస్ గత ఐదు నెలలుగా బంగ్లాదేశ్‌లో తమ కార్యకలాపాలను విస్తరించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశాయని తెలిపాయి. ఇందులో భాగంగా పాక్‌లోని పలు ప్రాంతాల నుంచి బంగ్లాదేశ్‌కు, నేపాల్‌కు నిరంతర వలసలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నాయి. ఆయా దేశాల్లో ఉగ్రవాద శిబిరాల నిర్మాణాలకు, నిర్వహణకు అవసరమైన నిధులను టర్కీ సమకూరుస్తున్నట్లు సమాచారం. ఢాకాలోని జమాత్-ఈ-ఇస్లామీ కార్యాలయం పునరుద్ధరణకు టర్కీ నిఘా సంస్థ నిధులు సమకూర్చినట్లు కూడా ఈ నిఘా వర్గాలు వెల్లడించాయి.

# సెలీనా జైట్లీ సోదరుడి నిర్బంధం

**నటి ఆవేదన**

న్యూఢిల్లీ: ప్రముఖ నటి సెలీనా జైట్లీ తన సోదరుడు, రిటైర్డ్ మేజర్ విక్రాంత్ కుమార్ జైట్లీ గురించి సోషల్ మీడియాలో ఒక భావోద్వేగ పోస్ట్ పెట్టారు. ఆయన 2024 నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో నిర్బంధంలో ఉన్నారు. తన సోదరుడు సైనిక యూనిఫాంలో ఉన్న ఫోటోను పంచుకుంటూ సెలీనా తన ఆవేదనను వ్యక్తం చేశారు. "డంపీ... నువ్వు క్షేమంగా ఉన్నావని ఆశిస్తున్నాను. నేను నీకు అండగా నిలబడ్డానని తెలుసుకో. నీ కోసం ఏడవకుండా ఒక్క రాత్రి కూడా నేను నిద్రపోలేదు. నీ కోసం నేను ఏమైనా వదులుకుంటాను. మన మధ్య ఎవరూ రాలేరని నమ్ముతున్నాను. నీ కోసం చేయని ప్రయత్నం లేదు. దేవుడు నీకు, నాకు దయ చూపిస్తాడని ఆశిస్తున్నాను. నీ రాక కోసం ఎదురుచూస్తున్నా భాయ్" అంటూ ఆమె ఎమోషనల్ అయ్యారు. విక్రాంత్ కుమార్ జైట్లీ నిర్బంధంపై నాలుగు వారాల్లోగా స్టేటస్ రిపోర్ట్ ఫైల్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఢిల్లీ హైకోర్టు ఆదేశించిన కొన్ని రోజులకే సెలీనా ఈ పోస్ట్ పెట్టడం గమనార్హం. యూఏఈలో నిర్బంధంలో ఉన్న తన సోదరుడికి భారత ప్రభుత్వం తరఫున అవసరమైన న్యాయ, వైద్య సహాయం అందించాలని కోరుతూ సెలీనా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో విక్రాంత్ కుమార్ పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని కూడా కోర్టు ఆదేశించింది. గత 14 నెలలుగా తన సోదరుడిని అబుదాబిలో అపహరించి, నిర్బంధించారని సెలీనా ఆరోపిస్తున్నారు. సరైన న్యాయ, వైద్య సహాయం కూడా అందించడం లేదని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. "నాలుగో తరం సైనికుడిగా, ఎన్నో యుద్ధాల్లో పాల్గొన్న వారి మనవడిగా దేశానికి తన యవ్వనాన్ని అంకితం చేసిన నా సోదరుడిని సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి భారత ప్రభుత్వం తప్పక పోరాడుతుందని నమ్ముతున్నాను" అని ఆమె గతంలో ఒక పోస్టులో పేర్కొన్నారు. సెలీనా తరఫున న్యాయవాదులు రాఘవ్ కక్కర్, మాధవ్ అగర్వాల్ వాదనలు వినిపిస్తున్నారు. "నోడల్ ఆఫీసర్ నియామకం వల్ల పిటిషనర్, ఆమె సోదరుడి మధ్య కమ్యూనికేషన్ సులభతరం అవుతుంది. ఆయనకు న్యాయ సహాయం అందించడానికి, కేసు స్టేటస్ తెలుసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. మా సోదరుడిని ఎందుకు నిర్బంధించారనే వివరాలు మాకు ఇంకా తెలియదు" అని అడ్వకేట్ రాఘవ్ కక్కర్ మీడియాకు తెలిపారు. ఈ కేసు తదుపరి విచారణ డిసెంబర్ 4న జరగనుంది.

# కశ్మీర్‌లో ఆపరేషన్.. అదుపులో 9 మంది

**ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ ముమ్మరం**

**పలు జిల్లాల్లో కొనసాగుతున్న బలగాల సోదాలు**

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో భద్రతా బలగాలు భారీ ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌ను చేపట్టాయి. లోయ వ్యాప్తంగా పలు జిల్లాల్లో విస్తృతంగా నిర్వహిస్తున్న సోదాల్లో భాగంగా నిన్న ఒక మహిళ సహా తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్ నేడు కూడా కొనసాగుతోంది. ఉగ్రవాదుల కదలికలపై అందిన పక్కా సమాచారంతో ఈ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇంటెలిజెన్స్ వర్గాల నివేదికల ప్రకారం ఎత్తైన పర్వత ప్రాంతాల్లో క్రియాశీలంగా ఉన్న ఉగ్రవాదులు శీతాకాలం సమీపిస్తుండటంతో మైదాన ప్రాంతాల్లో సురక్షితమైన ఆశ్రయం కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ సమాచారం ఆధారంగా భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. రాంబన్, కిష్త్వార్, దోడా, కథువా, రియాసి, పూంచ్, రాజౌరి జిల్లాల్లోని డజన్ల కొద్దీ ప్రదేశాలలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఆదివారం ప్రారంభమైన ఈ దాడులు, సోదాలు నేడు కూడా నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. అనుమానిత స్థావరాలపై భద్రతా బలగాలు జల్లెడ పడుతున్నాయి. ఉగ్రవాదుల ప్రణాళికలను భగ్నం చేసి, వారిని ఏరివేయడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్ జరుగుతోంది. అదుపులోకి తీసుకున్న నిందితులపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా) సెక్షన్లు 13, 28, 38, 39 కింద, అలాగే ఆయుధాల చట్టంలోని సెక్షన్ 7/25 కింద కేసులు నమోదు చేశారు. లోయలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి ప్రయత్నాన్నైనా అడ్డుకునేందుకు భద్రతా బలగాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాయి.


# ఔషధాలపై క్యూఆర్ కోడ్

**ముద్రణను తప్పనిసరి చేసిన కేంద్రం..**


**నకిలీ మందుల నియంత్రణకు కఠిన చర్యలు**

న్యూఢిల్లీ: దేశంలో నానాటికీ పెరుగుతున్న నకిలీ ఔషధాల బెడదకు శాశ్వతంగా అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసుకుంది. ప్రజల ఆరోగ్యాన్ని, ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని దేశంలో విక్రయించే అన్ని రకాల మందులపై ఇకపై క్యూఆర్ కోడ్ ముద్రించడాన్ని తప్పనిసరి చేసింది. 'ట్రాక్ అండ్ ట్రేస్' పేరుతో అమల్లోకి తెచ్చిన ఈ విధానం ద్వారా వినియోగదారులు తాము కొనుగోలు చేసే మందు అసలైనదో కాదో సులభంగా తెలుసుకునే వీలు కలుగుతుంది. ఈ కొత్త విధానం ప్రకారం వినియోగదారులు తమ స్మార్ట్‌ఫోన్‌తో మందుల ప్యాకెట్‌పై ఉన్న క్యూఆర్ కోడ్ లేదా బార్‌కోడ్‌ను స్కాన్ చేయాల్సి ఉంటుంది. అలా చేసిన వెంటనే ఆ ఔషధానికి సంబంధించిన పూర్తి వివరాలు ఫోన్ స్క్రీన్‌పై కనిపిస్తాయి. ఇందులో ఔషధం యూనిక్ ప్రొడక్ట్ ఐడెంటిఫికేషన్ కోడ్, జనరిక్ పేరు, తయారీదారు, బ్యాచ్ నంబర్, తయారీ తేదీ, గడువు తేదీ, తయారీ లైసెన్స్ నంబర్ వంటి కీలక సమాచారం ఉంటుంది. ఈ వివరాలు అందుబాటులోకి రావడం వల్ల మందు ప్రామాణికతను నిర్ధారించుకోవచ్చు. ప్రస్తుతానికి మార్కెట్‌లో ఎక్కువగా అమ్ముడయ్యే సుమారు 300 రకాల ఔషధాలపై ఈ క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఈ జాబితాలో అధికంగా వినియోగించే పెయిన్‌కిల్లర్లు, యాంటీబయాటిక్స్, యాంటీ-ఎలర్జిక్ మందులు ఉన్నాయి. రాబోయే రోజుల్లో ఈ నిబంధనను అన్ని ఫార్మా కంపెనీలకు, అన్ని రకాల మందులకు వర్తింపజేయాలని కేంద్రం యోచిస్తోంది. ఒకవేళ ఔషధం ప్యాకింగ్‌పై క్యూఆర్ కోడ్ లేకపోయినా, లేదా స్కాన్ చేసినప్పుడు సరైన వివరాలు కనిపించకపోయినా దానిని నకిలీ మందుగా అనుమానించే అవకాశం ఉంటుంది. ఈ పారదర్శక విధానం వల్ల కల్తీ మందుల తయారీదారులకు అడ్డుకట్ట పడటమే కాకుండా, వినియోగదారులకు తాము కొంటున్న మందుల నాణ్యతను స్వయంగా తనిఖీ చేసుకునే అధికారం లభిస్తుంది.

# పాక్‌కు అశాంతి రుచి చూపించాల్సిందే: మోహన్ భగవత్



బెంగళూరు: భారత్ ఎల్లప్పుడూ శాంతినే కోరుకుంటుందని, పొరుగు దేశాలతో సఖ్యతతో మెలగాలని కోరుకుంటుందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. అయితే, పొరుగు దేశమైన పాకిస్థాన్ మాత్రం మనతో శాంతియుతంగా ఉండాలని అనుకోవడం లేదని ఆయన ఆరోపించారు. భారత దేశానికి హాని కలిగించడం ద్వారానే పాక్ సంతృప్తి చెందుతుందని అన్నారు. ఈ పరిస్థితుల్లో మనం ఎల్లప్పుడూ శాంతి కోరుకోవడం మంచిది కాదని, పాక్ కు అర్థమయ్యే భాషలోనే జవాబివ్వడం మంచిదని స్పష్టం చేశారు. పాకిస్థాన్ కు నష్టం కలిగేలా ప్రతిసారీ ఓడిస్తూనే ఉండాలని చెప్పారు. అప్పుడు పాక్ శాశ్వతంగా పశ్చాత్తాపం చెందక తప్పదని అన్నారు. శాంతిని కోరుకోని వారికి అశాంతిని రుచి చూపించడం ద్వారానే బుద్ధి చెప్పాలని అన్నారు. 1971లో భారత సైన్యం ధాటికి పాకిస్థాన్ 90వేల మంది సైనికులను కోల్పోయిందని, అయినా సరే ఆ దేశ పాలకులకు బుద్ధి రాలేదని విమర్శించారు. భారత్ ను తాము చేయగలిగింది ఏమీలేదని పాక్ కు అర్థమయ్యే వరకూ ప్రతి దాడి చేయాలన్నారు. సరిహద్దుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, పాక్ కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిజాయతీగల స్నేహితుడిగా భారత్ కు సహకరిస్తేనే మీకు మేలు కలుగుతుందని పాకిస్థాన్ కు భగవత్ హితవు పలికారు.







## ది ప్యారడైజ్ కోసం భారీ సెట్

నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న కొత్త సినిమా ది ప్యారడైజ్. హిట్3 తర్వాత నాని చేస్తున్న ది ప్యారడైజ్‌కు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నారు. దసరా సినిమాతో ఫస్ట్ అటెంప్ట్‌తోనే మంచి హిట్ ను ఖాతాలో వేసుకోవడంతో పాటూ ఆ సినిమాతో నాని తనపై పెట్టుకున్న నమ్మకాన్ని కూడా నిలబెట్టుకున్నారు శ్రీకాంత్. ఆ నమ్మకంతోనే ఇప్పుడు నాని మరోసారి శ్రీకాంత్ కు ఛాన్స్ ఇచ్చారు. దసరా సినిమా తర్వాత నాని- శ్రీకాంత్ కాంబినేషన్ లో వస్తున్న సినిమా కావడంతో ది ప్యారడైజ్ పై అందరికీ భారీ అంచనాలున్నాయి. ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా శ్రీకాంత్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని ఆల్రెడీ రిలీజైన గ్లింప్స్ తోనే క్లారిటీ వచ్చింది. ది ప్యారడైజ్ నుంచి రా స్టేట్‌మెంట్ పేరుతో వచ్చిన గ్లింప్స్ కు ఆడియన్స్ నుంచి ఏ స్థాయి రెస్పాన్స్ వచ్చిందో కొత్తగా చెప్పనక్కర్లేదు. దసరాతో నానిని మాస్ హీరోగా ప్రెజెంట్ చేసిన శ్రీకాంత్ ఈసారి ది ప్యారడైజ్ ఇంకా కొత్తగా ప్రెజెంట్ చేయనున్నారని లుక్ చూస్తుంటే అర్థమవుతుంది. ఇదిలా ఉంటే ది ప్యారడైజ్ మూవీ గురించి దసరా సినిమాలో కీలక పాత్రలో నటించిన దీక్షిత్ శెట్టి రీసెంట్ గా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను రీసెంట్ గా ది ప్యారడైజ్ సెట్స్ కు వెళ్లానని దీక్షిత్ చెప్పారు. దసరా కంటే భారీగా.. ది ప్యారడైజ్ కోసం వేసిన సెట్, ఆ సెటప్ నెక్ట్స్ లెవెల్ లో ఉన్నాయని, ది ప్యారడైజ్ తెలుగు సినిమాకు గేమ్ ఛేంజర్ అవుతుందని, షూటింగ్ టైమ్ లో నాని లుక్ చూశాక తనకు గూస్‌బంప్స్ వచ్చాయని, ది ప్యారడైజ్ మూవీ దసరా సినిమా కంటే చాలా భారీగా ఉండబోతుందని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి 26న రిలీజ్ కానున్న ది ప్యారడైజ్ లో మోహన్ బాబు, రాఘవ్ జుయల్ కీలక పాత్రల్లో కనిపించనుండగా, అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.

## గోవిందాపై భార్య సీరియస్ కామెంట్స్!




బాలీవుడ్ స్టార్ హీరో గోవిందా భార్య సునీత అహూజా తన భర్త పై చేసిన కామెంట్స్ ప్రస్తుతం వైరల్ గా మారాయి. ఇటీవల ఈ జంట మధ్య దూరం పెరిగింది. కోర్టులో విడాకులకు దరఖాస్తు చేసుకున్నారని వార్తలు కూడా వచ్చాయి. ఆ తర్వాత కుటుంబ సభ్యులు ఈ జన్మకు గోవిందా నుంచి సునీత విడిపోరు! అని క్లారిటీ ఇచ్చారు. కానీ, ఆ తర్వాత సునీత అహూజా పాడ్ కాస్ట్ లలో మాట్లాడుతూ తన భర్త గోవిందా తప్పు ఒప్పులను ప్రశ్నిస్తూ కామెంట్స్ చేసింది. దాంతో, ఈ జంట విడిపోతుందని అర్థం అయింది. ఇదే క్రమంలో తాజాగా సునీత అహూజా.. గోవిందా గురించి మాట్లాడుతూ.. 'చిన్నతనంలో తప్పులు చేయడం సహజం. నేను కూడా చాలా తప్పులు చేసాను.. గోవిందా కూడా చేసాడు. కానీ, ఒక వయసు వచ్చాక కూడా తప్పులు చేస్తే ఎలా ?, మీకు భార్య, పిల్లలు ఉన్నప్పుడు ఎందుకు అలాంటి తప్పులు చేస్తారు ?. నిజం చెబుతున్నాను. గోవిందా తన జీవితంలో భార్యతో కంటే తన హీరోయిన్లతోనే ఎక్కువగా గడిపాడు. మొదట్లో నాకు ఏదీ అర్థం కాలేదు. అన్ని తెలిసే సరికి జీవితం చాలా ముందుకు వచ్చింది' అని ఆమె చెప్పుకొచ్చింది.



## పెళ్లి, పిల్లలు సూట్ కావు

హీరోయిన్ కంగనా రనౌత్ సోషల్ మీడియాలో ఎప్పుడూ ఫ్యాన్స్‌తో టచ్‌లో ఉంటుంది. ఇదే క్రమంలో తాజాగా కంగనా రనౌత్ తన ఫాలోవర్స్‌తో ముచ్చటిస్తూ.. కొన్ని ప్రశ్నలకు ఆసక్తికర సమాధానమిచ్చింది. ఓ నెటిజన్ కంగనా రనౌత్ ను ప్రశ్నిస్తూ.. 'మీకు రాజకీయాలు ఇష్టమా ? లేక, సినిమాలు ఇష్టమా ?' అని అడిగారు. ఈ ప్రశ్నకు కంగనా రనౌత్ సమాధానమిస్తూ.. 'మనకు ఒకటే నచ్చాలని లేదు కదా. కాలం మారేకొద్దీ ఇష్టాలు మారతాయి. ప్రతి కొత్త విషయం మనకు ఓ పాఠం నేర్పుతుంది. నాకు రెండు ఇష్టమే' అని కంగనా తెలిపింది. మరో నెటిజన్ ప్రస్తుతం మీరు ఓన్ చేస్తున్న మీ తదుపరి ప్రాజెక్ట్ ఏంటి ? అని అడగగా.. కంగనా రనౌత్ మాట్లాడుతూ.. 'ఓ కథ పై వర్క్ జరుగుతుంది. వచ్చే ఏడాదిలో ఆ సినిమా షూటింగ్ ప్రారంభమవుతుంది' అని కంగనా క్లారిటీ ఇచ్చింది. పెళ్లి పై మీ అభిప్రాయం ఏమిటి ? అని అడగగా.. 'నా పెళ్లి పై ఇప్పటికే ఎన్నో వార్తలు రాశారు. వాటిల్లో ఒక్కటి కూడా నిజం లేదు. పెళ్లి, పిల్లలు అనేవి నాకు సూట్ కావు' అంటూ కంగనా రనౌత్ చెప్పుకొచ్చింది.



## తమిళ నటుడు అభినయ్ కింగర్ కన్నుమూత

తమిళ చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ నటుడు అభినయ్ కింగర్ ఈ ఉదయం కన్నుమూశారు. గత కొన్నేళ్లుగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన, చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో కోలీవుడ్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. 'అరుముగ్', 'ఆరోహణం', 'సక్సెస్' వంటి పలు చిత్రాల్లో నటించి అభినయ్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన చివరిసారిగా 'వల్లవనుక్కు పుల్లుం ఆయుధం' అనే చిత్రంలో కనిపించారు. ఆ తర్వాత అనారోగ్య సమస్యలు తీవ్రం కావడంతో నటనకు పూర్తిగా దూరమై చికిత్స తీసుకుంటున్నారు. కాగా, తన మరణాన్ని ముందే ఊహించినట్లుగా మూడు నెలల క్రితం అభినయ్ ఒక వీడియోను విడుదల చేశారు. అందులో వైద్యులు తాను కేవలం ఏడాదిన్నర మాత్రమే జీవిస్తానని చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వీడియో విడుదలైన కొంత కాలానికే ఆయన మరణించడం అందరినీ కలచివేస్తోంది. ఆయన మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేస్తున్నారు.


## మరో ఐటెం సాంగ్‌లో తమన్నా?


మెగాస్టార్ చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో "మన శంకర వరప్రసాద్ గారు" అనే ఫుల్ కామెడీ ఎంటర్ టైనర్ రాబోతుంది. ఈ సినిమాలో మరో హీరో వెంకటేష్ కనిపించబోతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. ఐతే, తాజాగా ఈ సినిమా గురించి వినిపిస్తున్న అప్ డేట్ ప్రకారం ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ను డిజైన్ చేశారు. ఈ సాంగ్ కోసం తమన్నాను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. కమర్షియల్ ఎలిమెంట్స్ ను దృష్టిలో పెట్టుకుని అనిల్ రావిపూడి ఈ సాంగ్ ను పెట్టాడట. ఈ సినిమా గురించి మెగాస్టార్ ఆ మధ్య మాట్లాడుతూ.. 'ఈ సినిమా పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రమని.. ఈ సినిమా కచ్చితంగా అభిమానులకు నచ్చుతుంది' అని మెగాస్టార్ చిరంజీవి తెలిపారు. ఇక సాహు గారపాటి, సుస్మిత (చిరంజీవి కుమార్తె) సంయుక్తంగా ఈ సినిమాని నిర్మిస్తారని చిరు తెలిపారు. ఈ సినిమాలో నయనతార కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమా పై భారీ అంచనాలు ఉన్నాయి.



## 'ఆ' పాత్రలకు మాత్రం నో: రష్మిక

కన్నడ నుంచి నేషనల్ క్రష్ అయింది రష్మికా మందన్నా. టాలీవుడ్, బాలీవుడ్‌లో అమ్మడి సక్సస్ ల గురించి చెప్పాల్సిన పనిలేదు. ప్రస్తుతం రెండు భాషల్ని రష్మిక దున్నేస్తుంది. బాలీవుడ్ లో స్టార్ లీగ్ కి అతి సమీపంలో ఉంది. మరో రెండు బ్లాక్ బస్టర్లు పడ్డాయంటే? స్టార్ లీగ్ లాంఛనమే. అయితే అమ్మడు ఇంత బిజీగా ఉన్నా? కొరియన్ భాషపై సైతం అప్పుడే కన్నేసినట్లు కనిపిస్తుంది. కొరియన్ పై ముందొస్తు ప్రణాళిక తానెప్పుడో సిద్దం చేసి పెట్టుకుందని తాజాగా వెలుగులోకి వచ్చింది. కొరియన్ భాషలో నటించే అవకాశం వస్తే వెళ్లడానికి తాను సిద్దంగా ఉన్నట్లు వెల్లడించింది. కే-డ్రామాలంటే తనకు ఎంతో ఆసక్తిగా చెప్పుకొచ్చింది. వాటిలో నటించడం ఓ థ్రిల్లింగ్ గా భావిస్తానంది. లాక్ డౌన్ సమయంలో కొరియన్ సినిమాలు ఎక్కువగా చూసినట్లు తెలిపింది. అక్కడ నటీనటుల పనితనం ఎలా ఉంటుంది? ఎలాంటి కథలు తెరెక్కిస్తున్నారు? అక్కడ పని విధానం ఎలా ఉంటుంది? వంటి విషయాలు తెలుసుకున్నట్లు చెప్పుకొచ్చింది.






# ఎస్ఆర్‌హెచ్ వదిలేసే ఆటగాళ్ల జాబితా!



ఐపీఎల్ 2025 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తీవ్రంగా నిరాశపర్చింది. వై నాట్ 300 అంటూ భారీ అంచనాలతో బరిలోకి దిగిన ఆరెంజ్ ఆర్మీ కనీసం ప్లే ఆఫ్స్ కూడా చేరకుండానే ఇంటి దారిపట్టింది. తమకే సాధ్యమైన విధ్వంసకర బ్యాటింగ్‌తో ఈ సీజన్‌ను ప్రారంభించిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. అనూహ్యంగా వరుస పరాజయాలతో చతికిలపడింది. చివర్లో పుంజుకొని హ్యాట్రిక్ విజయం సాధించినా టోర్నీలో ముందడుగు వేయలేకపోయింది. మొత్తం 14 మ్యాచ్‌ల్లో 6 గెలవడంతో పాటు ఓ మ్యాచ్ రద్దవ్వడంతో 13 పాయింట్స్ సొంతం చేసుకొని 6వ స్థానంతో సరిపెట్టుకుంది. మహమ్మద్ షమీ, నితీష్ కుమార్ రెడ్డి, ఇషాన్ కిషన్, ట్రావిస్ హెడ్, ప్యాట్ కమిన్స్, జీషన్ అన్సారీలు తీవ్రంగా నిరాశపర్చారు. ముఖ్యంగా మహమ్మద్ షమీ, నితీష్ కుమార్ రెడ్డి, జీషన్ అన్సారీల వైఫల్యం సన్‌రైజర్స్ విజయవకాశాలను దెబ్బతీసింది. ఈ నేపథ్యంలో జట్టుకు భారంగా మారిన ఆటగాళ్లను వదులుకునేందుకు సిద్ధమైంది ముఖ్యంగా టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ షమీతో పాటు అభినవ్ మనోహర్, జీషన్ అన్సారీ, రాహుల్ చాహర్, ఆడమ్ జంపాలను సన్‌రైజర్స్ వదులుకునే ఛాన్స్ ఉంది. ఈ ఐదుగురు ఆటగాళ్లు జట్టుకు భారంగా మారారు.




**హైదరాబాద్ వదిలేసే ఆటగాళ్లు:**

మహమ్మద్ షమీ(రూ.10 కోట్లు), రాహుల్ చాహర్(రూ.3.20 కోట్లు), ఆడమ్ జంపా(రూ.2.4 కోట్లు), జీషన్ అన్సారీ(రూ.40 లక్షలు), అభినవ్ మనోహర్(రూ.3.20 కోట్లు)

**రిటైన్ చేసుకునే జాబితా:**

హెన్రిచ్ క్లాసెన్(రూ. 23 కోట్లు), ప్యాట్ కమిన్స్(రూ. 18 కోట్లు), ట్రావిస్ హెడ్(రూ. 14 కోట్లు), అభిషేక్ శర్మ(రూ.14 కోట్లు), నితీష్ కుమార్ రెడ్డి(రూ.6 కోట్లు), హర్షల్ పటేల్ (రూ. 8 కోట్లు), ఇషాన్ కిషన్ (రూ. 11.25 కోట్లు), సిమర్‌జీత్ సింగ్ (రూ. 1.50 కోట్లు), అథర్వ టైడ్ (రూ.30 లక్షలు), జయదేవ్ ఉనాద్కత్(రూ.1 కోటి), కమిందు మెండీస్(రూ.75 లక్షలు), అనికేత్ వర్మ(రూ.30 లక్షలు), బ్రైడన్ కార్స్(రూ. కోటి), ఇషాన్ మలింగా(రూ. 1.20 కోట్లు), సచిన్ బేబీ (రూ. 30 లక్షలు)

## విను మన్కడ్ ట్రోఫీలో హైదరాబాదీల సత్తా

హైదరాబాద్ క్రికెట్‌లో మరో కలికితురాయి చేరింది. హెచ్‌సీఏ ప్రతిష్టను ఇనుమడింపజేస్తూ మన హైదరాబాద్ కుర్రాళ్లు సత్తాచాటారు. ఇటీవల రాజ్‌కోట్‌లో జరిగిన విను మన్కడ్ ట్రోఫీలో హైదరాబాద్ టైటిల్ విజేతగా నిలువడంలో యువ క్రికెటర్లు కీలకంగా వ్యవహరించారు. అండగా నిలిస్తే అద్భుతాలు సృష్టిస్తామని నిరూపిస్తూ చాలా ఏండ్ల తర్వాత హైదరాబాద్‌కు బీసీసీఐ ట్రోఫీని అందజేశారు. 1937-38, 1986-87 రంజీ ట్రోఫీ టైటిళ్ల తర్వాత హైదరాబాద్‌కు దక్కిన మూడో బీసీసీఐ ట్రోఫీ విను మన్కడ్ కావడం విశేషం. రాజ్‌కోట్ వేదికగా ఈనెల 1వ తేదీన జరిగిన ఫైనల్ పోరులో హైదరాబాద్ 5 వికెట్ల తేడాతో పంజాబ్‌పై గెలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. కోచ్ భవనక సందీప్ శిక్షణలో రాటుదేలిన యువ క్రికెటర్లు హైదరాబాద్ క్రికెట్‌కు చుక్కానిలా కనిపిస్తున్నారు. సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటిన హైదరాబాద్ టీమ్ విజయంలో కెప్టెన్ ఆరోన్ జార్జ్, వైస్ కెప్టెన్ అలంకృత్ రాపోలు, యశ్‌వీర్‌గౌడ్, వఫీ కచ్చి కీలకంగా వ్యవహరించారు.




## టీ20 వరల్డ్ కప్ నా కలల టోర్నీ: అభిషేక్

టీ20లు అంటేనే చిచ్చరపిడుగుల హవా. ఈ ఫార్మాట్‌లో దంచికొట్టే ఆటగాళ్లు చాలామందే ఉన్నా తానే టాప్ అని చాటుకుంటున్నాడు భారత ఓపెనర్ అభిషేక్ శర్మ. ఐపీఎల్ నుంచి ఈ ఏడాది అంతర్జాతీయ మ్యాచ్లులోనూ అదరగొడుతున్న అభి పొట్టి క్రికెట్‌ను ఏలుతున్నాడు. ప్రత్యర్థి ఎవరైనా సరే దంచుడే పరమావధిగా ఆడుతున్న ఈ యంగ్‌స్టర్ నంబర్ 1 ర్యాంక్‌లో తిష్ట వేశాడు. ఆస్ట్రేలియా పర్యటనలో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన అభిషేక్ తన కలల టోర్నీ కోసం ఎదురుచూస్తున్నాని అంటున్నాడు. ఇంతకు అతడి డ్రీమ్ టోర్నీ ఏంటో తెలుసా..? పొట్టి క్రికెట్‌లో భీకర ఫామ్‌తో బౌలర్లకు దడ పుట్టిస్తున్న అభిషేక్ శర్మ ఓపెనర్‌గా స్థిరపడిపోయాడు. మెరుపు బ్యాటింగ్‌తో శుభారంభాలు ఇస్తూ టీమిండియాకు ప్రధాన అస్త్రంగా మారిన అతడు వరల్డ్ కప్ లక్ష్యంగా పెట్టుకున్నాడు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీ కోసం తాను సిద్ధమవుతున్నట్టు చెప్పాడీ సూపర్ స్ట్రయికర్. 'వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ నా కెరీర్లోనే అతిపెద్ద టోర్నీ కానుంది. చెప్పాలంటే అది నా కలల టోర్నమెంట్. నేను వరల్డ్ కప్ కోసం సిద్ధంగా ఉన్నాను. ఒకవేళ నాకు ఈ మెగా ఈవెంట్‌లో ఆడే అవకాశం వస్తే రఫ్ఫాడిస్తా' అని తన మనసులోని మాట చెప్పేశాడీ డాషింగ్ ఓపెనర్. ఆసియా కప్‌లో 314 రన్స్‌తో చెలరేగిన అభిషేక్.. ఆసీస్ గడ్డపై విధ్వంసక ఆటతో రెచ్చిపోయాడు. అభిషేక్ 28 ఇన్నింగ్స్‌లోనే వెయ్యి పరుగుల క్లబ్‌లో చేరాడు. టీ20ల్లో అత్యంత వేగంగా ఈ మైలురాయికి చేరిన భారత క్రికెటర్‌గా అవతరించాడీ లెఫ్ట్ హ్యాండర్. కంగారూలతో జరిగిన ఐదు టీ20ల సిరీస్‌లో 163 పరుగులతో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికయ్యాడీ డేరింగ్ బ్యాటర్. 200ల స్ట్రయిక్ రేటుతో ఆడుతున్న అభి.. ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే వరల్డ్ కప్ ఆడడం పక్కా అంటున్నారు విశ్లేషకులు. ప్రస్తుతం 925 రేటింగ్ పాయింట్స్‌తో అభిషేక్ టీ20ల్లో నంబర్ 1 ఆటగాడిగా కొనసాగుతున్నాడు.

## బ్యాటింగ్ ఆర్డర్ ప్రాధాన్యం ఇవ్వం: గౌతం గంభీర్

ఓపెనర్లు మినహా బ్యాటింగ్ ఆర్డర్‌కు అంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. టీ20ల్లో ఎన్ని పరుగులు చేశామనేది ముఖ్యం కాదని, ఎంత ప్రభావం చూపించామనేదే కీలకమని చెప్పుకొచ్చాడు. ఆస్ట్రేలియా పర్యటనలో ఐదు టీ20ల సిరీస్‌ను టీమిండియా 2-1తో కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ విజయం నేపథ్యంలో గంభీర్.. బీసీసీఐ టీవీతో మాట్లాడాడు. ప్రపంచకప్‌కు మూడు నెలల సమయం మాత్రమే ఉందని ఆటగాళ్లంతా సిద్ధంగా ఉండాలని సూచించాడు. కాలంతో పాటు టీ20 క్రికెట్ కూడా మారుతుందని, కోచ్‌లు కూడా అప్‌డేట్ కావాలని అభిప్రాయపడ్డాడు. 'శ్రీలంకలో నేను హెడ్ కోచ్‌గా బాధ్యతల చేపట్టిన తొలి రోజు నుంచి ఇప్పటి వరకు ఒకే ఐడియాలజీతో ఉన్నాను. ఈ విషయంలో ఎలాంటి మార్పు లేదు. ఓపెనర్లను మినహాయిస్తే.. బ్యాటింగ్ ఆర్డర్‌కు అంతగా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదు. ఓపెనర్లు మినహా మిగతా బ్యాటింగ్ లైనప్‌లో మార్పులు ఉంటాయి. ఎందుకంటే టీ20 క్రికెట్‌లో పరుగులు ఎన్ని చేశామనేది ముఖ్యం కాదు. ఎంత ప్రభావం చూపించామనేదే కీలకం. జనాలు కొన్నిసార్లు పరుగులు, ప్రభావాన్ని వేర్వేరుగా చూడలేరు. తప్పుగా లెక్కిస్తారు. టీ20ల్లో ఫలితం మనం చూపించే ప్రభావంపైనే ఆధారపడి ఉంటుంది. 120 బంతుల గేమ్‌లో ప్రతీ బంతిపై అత్యంత ప్రభావాన్ని చూపించాలి. అందుకే మేం తొలి రోజు నుంచే అందుకు తగిన బ్యాటింగ్ ఆర్డర్‌ను ఎంచుకున్నాం. ఈ ఆటను కూడా మేం అదే విధంగా ఆడాలనుకుంటున్నాం. టీ20ల్లో మేం సగటు, స్ట్రైక్రేట్‌ల గురించి ఆలోచిస్తూ ఆడాలనుకోవడం లేదు. ఏ పరిస్థితిలో ఏ ఆటగాడు ఎంత ప్రభావం చూపగలడనే దాని గురించే మేం ఆలోచిస్తున్నాం. ఇది ఈ జట్టుకు చాలా ముఖ్యమైనది. నా అభిప్రాయం ప్రకారం కాలంతో పాటు టీ20 క్రికెట్ మారుతుంది. కోచ్‌లు మారకపోతే ఆటలో వెనుకబడిపోతాం. టీ20 క్రికెట్‌లో మేం కాలానికి ముందే ఉండాలనుకుంటున్నాం. మా కుర్రాళ్లు ఈ ఆలోచనకు బాగా అలవాటు పడ్డారు. వారు ఈ స్ఫూర్తిని కొనసాగిస్తున్నారు. భారత జట్టులో అద్భుతమైన ఆల్‌రౌండర్లు ఉన్నారు. ఈ రకమైన స్పిన్ ఆల్‌రౌండర్ల లగ్జరీ ఏ జట్లకు ఉంది. విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు కొన్నిసార్లు పేస్ ఆల్‌రౌండర్ల లగ్జరీ మనకు దొరకదు. కానీ విదేశీ జట్లు మన దేశానికి వచ్చినప్పుడు అక్షర్, వాషింగ్టన్ సుందర్ వంటి ఆటగాళ్లు కీలకంగా మారుతారు. వారు బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్ చేయగలరు. కేవలం బ్యాటర్‌గా కూడా జట్టులో కొనసాగగలరు. ఇది జట్టుకు కలిసొచ్చే అంశం. అప్‌కమింగ్ టీ20 ప్రపంచకప్‌లో ఈ ఇద్దరూ చాలా కీలకమవుతారు. వారికి ఉన్న నైపుణ్యాలతో ఎలాంటి పరిస్థితుల్లోనైనా రాణించగలరు'అని గంభీర్ చెప్పుకొచ్చాడు.






## సీఎస్‌కే కెప్టెన్‌గా శాంసన్..?

ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే)ను వెటరన్ వికెట్ కీపర్ సంజూ శాంసన్ నడిపించబోతున్నాడా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఈ మేరకు రాజస్థాన్ రాయల్స్‌తో చెన్నై సూపర్ కింగ్స్ ట్రేడ్ డీల్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2026 మినీ వేలానికి ముందే ట్రేడింగ్ డీల్ ద్వారా రాజస్థాన్ రాయల్స్ నుంచి సంజూ శాంసన్‌ను సీఎస్‌కే తీసుకోనున్నట్లు తెలుస్తోంది. సంజూ శాంసన్‌ను ఇవ్వాలంటే ఇద్దరు ఆటగాళ్లను ఇవ్వాలని రాజస్థాన్ రాయల్స్ చేసిన ప్రతిపాదనకు సీఎస్‌కే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు ఓ జాతీయ ఛానెల్ పేర్కొంది. సంజూ శాంసన్ కోసం స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాతో పాటు సామ్ కరణ్‌ను వదులుకునేందుకు సీఎస్‌కే సిద్ధమైనట్లు సమాచారం. ఈ ఇద్దరిని తీసుకునేందుకు రాజస్థాన్ రాయల్స్ అంగీకరిస్తే.. ఆటగాళ్ల మార్పిడి ప్రక్రియ పూర్తవుతుంది. సంజూ శాంసన్ తన ఐపీఎల్ కెరీర్‌లో ఎక్కువ కాలం రాజస్థాన్ రాయల్స్‌కే ఆడాడు. ఐపీఎల్ 2021 సీజన్ నుంచి కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. మరోవైపు జడేజా తన కెరీర్‌ను రాజస్థాన్ రాయల్స్‌తో ప్రారంభించాడు. ఆ తర్వాత చెన్నైకే ఎక్కువ ప్రాతినిధ్యం వహించాడు. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ సామ్ కరణ్ సీఎస్‌కేతో పాటు పంజాబ్ కింగ్స్‌కు ఆడాడు. సంజూ శాంసన్, రవీంద్ర జడేజా ఐపీఎల్ వేతనం రూ. 18 కోట్లు. కాబట్టి ఇది స్వాప్ డీల్. కానీ సామ్ కరణ్ ధర రూ. 2.40 కోట్లు. ఈ డబ్బును రాజస్థాన్ రాయల్స్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ ట్రేడింగ్ డీల్ విషయమై త్వరలోనే అధికార ప్రకటన రానుందని ఇరు జట్ల వర్గాలు పేర్కొన్నాయి. సంజూ శాంసన్‌ను జట్టులోకి తీసుకొని సారథ్య బాధ్యతలు అప్పగించాలనే యోచనలో సీఎస్‌కే ఉంది. మహేంద్ర సింగ్ ధోనీ కెరీర్ చివరి దశలో ఉండటం..కెప్టెన్‌గా రుతురాజ్ గైక్వాడ్ ఆశించిన ఫలితాలు అందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2026 మినీ వేలంలో డిసెంబర్ చివరి వారంలో జరిగే అవకాశం ఉంది. నవంబర్ 15లోపు ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్, రిలీజ్ ఆటగాళ్ల జాబితాలను ప్రకటించాల్సిఉంటుంది.

## సిగ్గు లేకుండా వాడుకుంటారు జాగ్రత్త

**వరల్డ్ కప్ విజేతలకు గవాస్కర్ స్వీట్ వార్నింగ్**



మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో విజేతగా నిలిచిన భారత ప్లేయర్లను దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ హెచ్చరించారు. ఈ గొప్ప విజయాన్ని కొందరు వాడుకుంటారని, అవార్డులు, రివార్డులు ప్రకటిస్తూ ఫ్రీ పబ్లిసిటీ కోసం వాడుకుంటారని చెప్పారు. 1983 ప్రపంచకప్ విజేతలుగా తమకు ఈ అనుభం ఎదురైందని ఓ జాతీయ దినపత్రికకు రాసిన కాలమ్‌లో పేర్కొన్నారు. తొలి మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. ఇప్పటికే బీసీసీఐ రూ. 51 కోట్ల భారీ క్యాష్ ప్రైజ్ ప్రకటించగా.. ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ఆటగాళ్లను ఘనంగా సత్కరించడంతో పాటు నగదు ప్రోత్సహకాలను అందజేస్తున్నారు. కొందరికి ఉద్యోగాలు కూడా ఇస్తామని ప్రకటించాయి. రివార్డుల విషయంలో ఆటగాళ్లంతా జాగ్రత్తగా ఉండాలని సునీల్ గవాస్కర్ సూచించారు. ప్రకటించిన రివార్డ్స్ అందుకోకపోతే బాధపడవద్దని చెప్పారు. 'అమ్మాయిలు కాస్త జాగ్రత్తగా ఉండండి. మీ మంచి కోరే ఈ మాటలు. అందరూ మాట ఇచ్చినట్లుగా మీకు అవార్డులు, రివార్డులు దక్కకపోతే అస్సలు బాధపడొద్దు. మన దేశంలో అడ్వర్టైజర్లు, బ్రాండ్లు, కొంతమంది వ్యక్తులు ఉచిత ప్రచారం కోసం విజేతలను తమ భుజాలపై మోస్తారు. విజేత టీమ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ ఫుల్‌పేజీ యాడ్లు, హోర్డింగ్‌లు పెట్టిస్తారు. టీమ్‌మేనేజ్‌మెంట్, స్పాన్సర్లు తప్పా మిగతా వారంతా ఫ్రీ పబ్లిసిటీ కోసమే ఇదంతా చేస్తారు. వాస్తవానికి వారి వల్ల భారత క్రికెట్‌కు ఒరిగేది ఏం లేదు. 1983 ప్రపంచకప్ గెలిచినప్పుడు కూడా మాకు ఇలానే పెద్ద పెద్ద హామీలు ఇచ్చారు. వాటి గురించి మీడియాలో కూడా వార్తలు వచ్చాయి. కానీ అవేవి కార్యరూపం దాల్చలేదు. అయితే మీడియాను కూడా తప్పుబట్టాల్సిన అవసరం లేదు. ఆటగాళ్లతో పాటు వారు కూడా బాధితులే. విజేతలకు ప్రకటించిన నజరానాల గురించి పెద్ద పెద్ద హోర్డింగ్స్ పెడుతారంతే. అయితే విజేతలతో పాటు మీడియాను కూడా కొంతమంది సిగ్గులేని వాళ్లు ఉపయోగించుకుంటారని వారికి తెలిసి ఉండదు.



ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
మంగళవారం 11-11-2025 www.evarthalu.com




ప్రమాదకర మలుపులు..
డ్రైవర్ల నిర్లక్ష్యం..
అతివేగం..
నిద్రలేమి..
జాగ్రత్తలు లేకపోవడం..

"ఇలా కారణం ఏమైనా కానీ ఎన్నో ప్రాణాలను ప్రమాదాలు బలి గొంటున్నాయి. ఈ మధ్య కాలములో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. కారణాలు అనేకం అందులో కొన్ని "మన" నిర్లక్ష్యం వల్ల మాత్రమే జరుగుచున్న ప్రమాదాలు. వీటికి బాధ్యులు ఎవరు?

# రహదారులు రక్తపుటేర్లు

మన దేశంలో జరుగుతున్న మరణాల్లో అత్యధికం రోడ్డు ప్రమాదాల వల్ల అని లెక్కలు ఋజువు చేస్తున్నాయి.ఈ మధ్య జరిగిన ప్రమాదంలో ముగ్గురు అక్కాచెల్లెళ్ళు మరణించడం అనేది ఎంతో విచారకరం.ఆ ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు ఆసరా ఎలా? ఎన్నో ఆశలు ఆశయాలతో సాఫ్ట్వేర్ ఉద్యోగములో ఉండి పిల్లలకు ఉజ్వల భవిష్యత్ ఇద్దామని భావించిన తల్లితండ్రుల మరణం లోటును పూడ్చేదెవరు? ఒకప్పుడు ద్విచక్ర వాహనాలు మాత్రమే ప్రమాదాలకు గురిఅయ్యేవి.కానీ నేడు బస్సులు,రైళ్లు,విమానాలు,కార్లు ఇలా ఏ వాహనంలో వెళ్లిన క్షేమంగా తిరిగి వచ్చేవరకు కుటుంబ సభ్యులు ఆందోళన చేందుచున్నారంటే ప్రమాదాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. రోడ్డు ప్రమాదాలు జరగడానికి ఇదే కాకుండా మరెన్నో కారణాలు ఉన్నాయి.కాబట్టి రహదారి భద్రత పై అవగాహన కలిగి ఉండడం వల్ల ప్రమాదాలు జరగకుండా కొంతైనా నిరోధించవచ్చు. మైనర్ లకు వాహనాలు ఇచ్చినందుకు తల్లిదండ్రులపై కేసులు నమోదు కావడమే కాకుండా జైలుకు వెళ్లిన సందర్భాలు ఉన్నవి.ఇంత కఠిన నియమాలు ఉన్నాకూడా అక్కడక్కడ మైనర్లు వాహనాలు నడపడం,ప్రాణాలు కోల్పోవడం చూస్తేనే ఉన్నాం. భారత దేశములో జరుగుచున్న మరణాలను అధ్యయనం చేసిన సంస్థ గణాంకాల ఆధారంగా చూస్తే మనదేశంలో జరుగు చున్న మరణాల్లో ప్రథమ స్థానంలో రోడ్డు ప్రమాదంలో మరణించడం, రెండవ స్తానంలో ఆత్మహత్య లు చేసుకువడం వల్ల మరణాలు జరుగుచున్నట్టు ప్రకటించింది. 40 శాతం మరణాలు రోడ్డు ప్రమాదాల వల్లజరిగితే అందులో అధిక వేగం వల్ల అరవై శాతంకు పైగా మరణాలు జరుగుచున్నట్లు ప్రకటించారు. రోడ్డు ప్రమాదాలు అనేవి మానవ తప్పిదం వల్ల జరుగుచున్నవే. ప్రజలందరికీ అవగాహన కల్పించడం వల్ల రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించే అవకాశం ఉంది.రొడ్డును ఎప్పటికప్పుడు బాగు చేయడం, మూల మలుపుల వద్ద నెమ్మదిగా వెళ్ళేలా చూడడం వల్ల ప్రమాదాల సంఖ్య తగ్గేలా చూడవచ్చు. మన దేశంలో మోటారు వాహనాలు అధికంగా పెరగడం వల్ల రహదారి ప్రమాదాలు రోజురోజుకు అధికమవుచున్నాయి. వాహనాల సంఖ్య తో పాటు ప్రమాదాల సంఖ్య కూడా పెరగడం విచారకరం. నిత్యజీవితములో సులభంగా వెళ్ళడానికి, సౌకర్యవంతంగా వెళ్ళడానికి మరియు ప్రశాంతంగా వెళ్ళడానికి చిన్న వాహనాలు అవసరం. ప్రస్తుత పరిస్థితిని ఒకసారి గమనించినట్లయితే ప్రతి ఒక్క కుటుంబంలో ఇనీసం రెండు వాహనములు ఉన్నాయి. అందువలన రహదారులపై పెరిగిన రద్దీకి తగు విధంగా రోడ్ల నిర్మాణం జరగడంలేదు. నేటి వేగవంతమైన నమాజంలో మానవ తప్పిదం వలన, సరియైన రహదారులు లేకపోవడం వలన, వాహనములు కండీషన్లో లేకపోవడం వలన, అతి వేగంగా వాహనములు నడపడం వలన, డ్రైవర్ల నిర్లక్ష్యము, రహదారి వినియోగదారుల బాధ్యతలేని ప్రవర్తన, రహదారి నియమాలను, సిగ్నల్స్‌ను పాటించక పోవడం, అవగాహన లోపం వంటి కారణముల వలన రహదారి ప్రమాదములు ఎక్కువగా జరుగుతున్నాయి. అంతే కాక ఇసుకలారీలు, కంకర టిప్పర్ల అతివేగం ప్రమాదాలకు కారణం అయిన సందర్భాలు ఉన్నాయి.

రహదారి ప్రమాదాలు నివారణ ఎలా అని మనం ఆలోచించాల్సిన అవసరం ఉంది.కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రమాదాలను కొంతవరకు తగ్గించిన వారం అవుతాము.వాహనాలు నడపడం అనేది ఒక వ్యక్తిగత అనుభవంగా కాక సామాజిక బాధ్యతగా వాహనము నడిపే వారందరూ గుర్తించాలి. రహదారి భద్రతా నియమాలను సక్రమంగా పాటించడము అతి ప్రధానమైన ప్రమాదాల నివారణకు ముఖ్యమైన మార్గం.కొన్ని సూచనలు, నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చు.అతివేగం ప్రమాదకరం అనిగుర్తించాలి. ముందుగా బయలుదేరడం వల్ల నెమ్మదిగా వెళ్లిన క్షేమంగా గమ్యం చేరవచ్చని గుర్తించాలి. మద్యం సేవించి వాహనంనడుపకుండా చూసుకోవాలి.ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ పెట్టుకోవాలి. కారు నడిపేటప్పుడు సీటు బెల్టు తప్పకుండా పెట్టకోవాలి. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మోటారు వాహనాలు నడుపరాదు. ట్రాఫిక్ నియమాలు పాటించడం వల్ల ప్రమాదాలు నివారించ గలుగుతాము. రోడ్డుపై సంభాషిస్తూ ట్రాఫిక్‌కు అవరోధం కల్పించకుండా ఉండాలి.సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపవద్దు.వాహనం నడిపేటప్పుడు పక్కవారితో సంభాషించవద్దు. ఇరుకు వంతెనల వద్ద ట్రాఫిక్‌ను గమనించి సహనంతో దాటాలి.కదులుతున్న వాహనం ఎక్కడం కానీ, దిగడం కానీ చేయవద్దు. మోటారు సైకిల్‌పై ఇద్దరికి మించి ప్రయాణించడం ప్రమాదకరం అని గుర్తించాలి.సరియైన సంకేతం ఇవ్వకుండా ఎడమ వైపు లేదా కుడి వైపునకు వాహనాలను తిప్పవద్దు.రాత్రి సమయంలో ఎదురుగా వాహనములు వచ్చినప్పుడు రోడ్డు మీద ప్రమాదాలకు డ్రైవర్ ఎంత కారకుడో పాదచారులు కూడా అంతే కారణమని గుర్తించి తగు జాగ్రత్తలతో నడవాలి.ముందు వెళ్ళే వాహన డ్రైవరు దారి ఇవ్వనిచో ఎడమ వైపు నుంచి దాటే ప్రయత్నం చేయవద్దు. తడిగా ఉన్న, ఆయిల్ పడి ఉన్న ఇసుక, దుమ్ము బురద ఉన్న రోడ్డుపై,రోడ్డు మరమ్మత్తులు జరుగుచున్నప్పుడు వేగంగా వెళ్లుట ప్రమాదకరం అని గుర్తించాలి.రోడ్డు నిబంధనలు, సూచనలు డ్రైవర్లకు మాత్రేమే కాదని,పాదాచారులు కూడా రోడ్డుకు ఇరువైపులా చూసీ వాహనములు రానప్పుడు, జిబ్రా లైన వద్ద రోడ్డును దాటాలి. రోడ్డుపై ఆటలాడటం, రోడ్డుపైకి అకస్మాత్తుగా రావడం ప్రమాదకరం. కాపలా లేని రైల్వే క్రాసింగ్ రెండు వైపులా చూసి ఏ రైలూ రావడం లేదని నిర్ధారించుకున్న తర్వాతనే రైల్వే లైన్ దాటాలి. సరియైన కండీషన్ లేని వాహనాలు నడుపరాదు. నిర్ధారిత స్థలంలోనే వాహనాలను పార్క్ చేయాలి. రోడ్డుపై రాత్రి వేళల్లో వాహనాన్ని నిలిపి వుంచినపుడు పార్కింగ్ లైట్లు తప్పని సరిగా వేయాలి. ప్రతి వాహనానికి ముందు వెనక రిఫ్లెక్టివ్ రేడియం స్టిక్కర్స్ అంటించాలి. వాహనాలలో ఎక్కువ శబ్దముతో పాటాలు పెట్టకూడదు. వాహనం నడుపుచున్నప్పుడు రోడ్డుపై దృష్టి నిలుపాలి. అన్యమనస్కంగా ఉన్నప్పుడు లేదా నిద్రమత్తు కలిగినపుడు వాహనం నడపకూడదు. వాహనం మలుపు తిరుగుతున్నప్పుడు మరియునిలుపుతున్నప్పుడు సరియైన సంకేతాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు నివరించ వచ్చు.ఇలా వాహనాల యజమానులు, డ్రైవర్లు రోడ్డు నిబంధనలను సక్రమంగా పాటించి రోడ్డు ప్రమాదాలు నివారించడానికి తోడ్పడవలసిన బాధ్యత ఉంది. రోడ్డు మీద వెళుతుంటే కొందరు ఎడమ వైపు నుంచి వచ్చి ఓవర్ టేక్ చేస్తుంటారు. ఇది అమర్యాదకరమే కాకుండా ప్రమాదానికి కూడా కారణమవుతుంది. ఎవరైనా కుడి వైపు నుంచి మాత్రమే ఓవర్‌టేక్ చేయాలన్నది నియమం. ఇది పాటించడం అందరికీ సౌఖ్యం.అలాగే రోడ్డు మీద పాదచారులు నడవటం కోసం ఏర్పాటు చేసిన క్రాసింగ్ దగ్గర వాహనాల స్పీడ్‌ను తగ్గించుకోవాలి.అలా కాకుండా ఎవరికివాళ్ళు దూసుకుపోతా మంటే పాదచారుల పరిస్థితి ఏమిటి అని ఆలోచించి ట్రాఫిక్ రూల్స్ పాటించాలి. కనీస నియమాలు పాటించడం మన బాధ్యత అని గుర్తించి, ట్రాఫిక్ రూల్స్‌ని పాటిస్తు మీ ప్రాణాలు కాపాడుకుంటూ ఇతరుల ప్రాణాలు కూడా కాపాడండి.

**వేగం కన్నా ప్రాణం మిన్న.. అతి వేగం ప్రమాదకరం అని గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.**


-గడప రఘుపతిరావు, 9963499282
raghupatiraog@gmail.com




...నేడు జాతీయ విద్యా దినోత్సవం...

## ప్రతి ఒక్కరికి విద్య.. ప్రతి ఒక్కరి బాధ్యత

నవంబర్ 11 న జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఈ రోజునే ఎందుకు జరుపుకుంటారు? అంటే.. మన దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో సమరయోధులు బ్రిటీష్ పాలకులపై వీరోచితంగా పోరాడారు. అలాంటి సమరయోధులలో మౌలనా అబుల్ కలాం అజాద్ ఒకరు.

ఆయన కేవలం పోరాటమే కాక, స్వాతంత్ర్యానంతరం మొట్టమొదటి కేంద్ర విద్యా శాఖ మంత్రిగా దేశానికి సేవలందించారు.




Education

ఆయన ఆ పదవిలో చనిపోయేవరకూ దాదాపు 11 సంవత్సరాలు ఉన్నారు. విద్యా శాఖ కోసం అజాద్ చేసిన సేవలకు కృతజ్ఞతగా ఆయన జన్మదినాన్నే మనందరం నేడు జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. భారత దేశ మొదటి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ పుట్టిన రోజును జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకోవాలని 2008లో అప్పటి మానవవనరుల అభివృద్ధి శాఖ ప్రకటించింది. ప్రస్తుతం ఈ శాఖనే విద్యా శాఖ అని పిలుస్తున్నాం. అప్పటినుంచి ప్రతి ఏటా నవంబర్ 11న ఒక థీమ్ పెట్టుకుని మరీ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది కేంద్ర ప్రభుత్వం. వివిధ రంగాలలో ఆయన చేసిన కృషిని, సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయనకు 1992లో దేశంలోనే అత్యున్నత పురస్కారం అయిన భారతరత్నను ప్రదానం చేసింది. ఆజాద్ తన పదవి కాలంలో బాలిక, గ్రామీణ విద్య కోసం ఎంతగానో కృషి చేశారు. ఆయన సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ చైర్మన్‌గా ఉన్నప్పుడు వయోజన అక్షరాస్యత, సార్వత్రిక ప్రాథమిక విద్య, 14 సంవత్సరాలలోపు ఉన్న బాలబాలికలందరికీ నిర్భంద ఉచిత విద్య, వృత్తిపరమైన శిక్షణ వంటి వైవిధ్యభరితమైన విధానాలతో విద్యా శాఖ కోసం తన వంతు కృషి చేశారు. ఆయన నేతృత్వంలోనే అనేక విద్యాలయాలు నిర్మతమయ్యాయి. ఢిల్లీలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, 1951లో దేశంలోనే ప్రప్రథమంగా ఐఐటీ కారగ్పూర్, జామియా మిలియా ఇస్లామియా, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్‌లను స్థాపించింది ఆయనే. అంతే కాక ఢిల్లీ యూనివర్సిటీలో సాంకేతిక విభాగ ఫాకల్టీగా, ఐఐఎస్‌సీ బెంగళూరు అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు. ఇంతగా విద్యా శాఖ కోసం పాటు పడిన ఈ మహనీయుని స్మారకార్థంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తోంది.


## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811



OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.